


గిరి ప్రదక్షిణ కోసం శ్రీకాళహస్తి పురవీధుల్లో సాగుతున్న స్వామి అమ్మవార్లు


రామాపురం రిజర్వాయరు వద్ద సేద తీరుతున్న భక్తులు

దేవతలారా.. వెళ్లి రండి

కొండచుట్టుకు వెళుతూ వీడ్కోలు పలికిన ఆదిదంపతులు

కైలాసగిరుల చుట్టూ భక్తుల కోలాహలం

శ్రీకాళహస్తి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం శివ పార్వతుల కొండ చుట్టు (గిరి ప్రదక్షిణ) వేడుకగా జరిగింది. ఈ సందర్భంగా తమ కల్యాణానికి విచ్చేసిన సకల దేవతాగణాలు, మునులు, రుషులకు ఆది దంపతులు వీడ్కోలు పలికారు. కృతజ్ఞతలు తెలిపారు. తొలుత ఆలయంలోని యాగశాలలో కలశాలకు ప్రత్యేకపూజలు చేశారు. శ్రీకాళహస్తీశ్వరుడు, జ్ఞానప్రసూనాంబదేవి ఉత్సవర్లను అలంకార మండపంలో అలంకరించి, పూజలు నిర్వహించాక చప్పరాలపై కొండచుట్టుకు తీసుకెళ్లారు. బేరివారి మండపం వద్ద బేరి కులస్తులు ఇచ్చిన నాగవల్లిని అమ్మవారికి ధరింపజేశారు. జయరామరావు వీధి, ఎన్టీఆర్ నగర్, తెలుగుగంగకాలనీ, కైలాసగిరి కాలనీ, రాజీవ్‌నగర్‌కాలనీ మీదుగా గిరిప్రదక్షిణ జరిగింది. రామాపురం రిజర్వాయరు సమీపంలోని అంజూరు మండపం వద్ద కాసేపు ఉత్సవర్లు సేదతీరారు. ఆలయం తరపున, దాతల ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. అక్కడ్నుంచి వెయ్యిలింగాలకోన, వేడాం మీదుగా శుకబ్రహ్మాశ్రమ సమీపంలోని ఎదురుసేవ మండపానికి సాయంత్రానికి చేరుకున్నారు. అక్కడ ఆలయ అధికారులు, అర్చకులు, భక్తులు స్వామి అమ్మవార్లకు స్వాగతం పలికారు. మండపంలో పూజల అనంతరం ఉత్సవమూర్తులను ముక్కంటి ఆలయానికి తీసుకొచ్చారు. కొండచుట్టుకు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ ఈవో బాపిరెడ్డి, బొజ్జల రిషితారెడ్డి, ఉభయదారులు మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి దంపతులు, టీడీపీ నాయకులు చెంచయ్యనాయుడు, కంఠా రమేష్, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.


కైలాసగిరుల్లో స్వామి అమ్మవార్ల ఊరేగింపు


ఎదురుసేవ మండపం వద్ద స్వామి అమ్మవార్లు



అశ్వ, సింహ వాహనాలపై ఆది దంపతుల వైభవం

కైలాసగిరి ప్రదక్షిణ చేసి సకల దేవతా గణాలకు వీడ్కోలు పలికిన ఆదిదంపతులు రాత్రి 8 గంటల తర్వాత ఆలయానికి చేరుకున్నారు. కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్న అనంతరం శ్రీకాళహస్తీశ్వరుడు అశ్వ వాహనంపై, జ్ఞానప్రసూనాంబదేవి సింహ వాహనంపై అధిష్ఠించి పురవిహారం చేశారు. భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

ఉదయం 9గంటలకు: కేడిగ వాహనసేవ
సాయంత్రం 7 గంటలకు: ధ్వజావరోహణం
రాత్రి 9గంటలకు: సింహాసనం, కామధేనువు వాహనసేవ

● విజయవాడ నుంచి తిరుపతికి

● 20 ఏళ్ల యువకుడికి అమర్చిన వైద్యులు
● శ్రీపద్మావతి హృదయాలయలో 18వ గుండె మార్పిడి శస్త్ర చికిత్స

'గుండె' ప్రయాణం


విమానాశ్రయం నుంచి ప్రత్యేక వాహనంలో గుండెను తీసుకువస్తున్న వైద్యులు

విజయవాడ నుంచి ఒక గుండె ప్రయాణం సాగింది. ఆ 32 ఏళ్ల వ్యక్తి గుండెను.. 20 ఏళ్ల యువకుడికి తిరుపతిలో అమర్చారు. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన విజయవాడకు చెందిన ప్రదీప్ (32)కు అక్కడి క్యాపిటల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బ్రెయిన్‌డెడ్‌కు గురయ్యారు. అంత విషాదంలోనూ గుండె దిటవు చేసుకున్న అతడి కుటుంబ సభ్యులు.. మరొకరి ప్రాణం నిలిపేందుకు అవయవదానానికి ముందుకొచ్చారు. అదే సమయంలో గుండె సంబంధిత వ్యాధితో నెల రోజులుగా తిరుపతిలోని శ్రీపద్మావతి హృదయాలయ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 20 ఏళ్ల యువకుడికి గుండె మార్పిడి చేయాల్సి ఉంది. జీవన్‌దాన్‌పోర్టల్‌లో ఈ వివరాలు నమోదు చేశారు. ఈ క్రమంలో ప్రదీప్ విషయం తెలిసి శ్రీపద్మావతి హృదయాలయ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి.. ప్రత్యేక బృందంతో శనివారం రాత్రి విజయవాడకు చేరుకున్నారు. ప్రదీప్ గుండెను ఆదివారం అంబులెన్సులో గన్నవరం విమానాశ్రయానికి.. అక్కడ్నుంచి ప్రత్యేక విమానంలో తిరుపతి ఎయిర్‌పోర్టుకు సాయంత్రం 4.10గంటలకు తీసుకొచ్చారు. అప్పుడే సిద్ధంగా ఉన్న ప్రత్యేక అంబులెన్స్‌లో ఆ గుండెను పద్మావతి చిన్నపిల్లల హాస్పిటల్‌కి తరలించారు. గుండె ప్రయాణ సమయంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు డీఎస్పీ శ్రీనివాస రావు నేతృత్వంలో ప్రత్యేక గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేశారు. 4.30 గంటలకంతా శ్రీపద్మావతి హృదయాలయ ఆస్పత్రికి గుండె చేరుకుంది. ఆ వెంటనే గుండె మార్పిడి శస్త్రచికిత్స చేపట్టారు.

కాగా, శ్రీపద్మావతి హృదయాలయలో ఇప్పటి వరకు 17 శస్త్ర చికిత్సలను విజయవంతంగా పూర్తి చేశారు. ఇది 18వది.

- తిరుపతి(వైద్యం) / రేణిగుంట, ఆంధ్రజ్యోతి

10 కిలోల గంజాయి స్వాధీనం

● ముగ్గురు తమిళనాడువాసుల అరెస్టు

తడ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): పది కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ముగ్గురిని అరెస్టు చేసినట్లు సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. తడ మీదుగా చెన్నైకు గంజాయి తరలిస్తున్నట్లు శనివారం పోలీసులకు సమాచారం అందింది. శనివారం రాత్రి నుంచి వాహనాల తనిఖీ చేపట్టడంతో పాటు అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై పోలీసులు నిఘా పెట్టారు. ఆదివారం తెల్లవారుజామున శ్రీసిటీకి జీరో పాయింటు సమీపంలో ముగ్గురు వ్యక్తులు బ్యాగులు ధరించి అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో అదుపులోకి తీసుకుని విచారించారు. వారి బ్యాగులను తనిఖీ చేయగా సుమారు రూ.లక్ష విలువైన పది కిలోల గంజాయి లభ్యమైంది. నిందితులు తమిళనాడు రాష్ట్రం తిరవళ్లూరు జిల్లా తిరునింద్రపూర్ గ్రామానికి చెందిన హరీష్, చెన్నై నుంగంబాకం ప్రాంతానికి చెందిన కే.వడివేలు అలియాస్ వేలు, బి.కార్తికేయన్ అలియాస్ కార్తీగా తెలిసింది. నిందితులను కోర్టులో హాజరు పరుస్తామని సీఐ తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో చొరవ చూపిన ఎస్ఐ కొండప్ప నాయుడు, సిబ్బందిని అభినందించారు.


పట్టుబడ్డ గంజాయి, నిందితులతో సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ కొండప్ప నాయుడు

పుత్తూరు మున్సిపాలిటీలో కొనసాగుతున్న విచారణ!

పుత్తూరు అర్బన్, మార్చి2(ఆంధ్రజ్యోతి): పుత్తూరు మున్సిపాలిటీలో ఆదివారం సెలవు రోజు అయినప్పటికీ విచారణ కొనసాగింది. పురపాలక శాఖ రీజనల్ డైరెక్టర్ విశ్వనాథ్ నేతృత్వంలోని కమిటీ సభ్యులు ప్రధానంగా అకౌంట్స్, ఇంజనీరింగ్ విభాగాల్లో రికార్డుల తనిఖీ చేపట్టారు. కమిటీ సభ్యులైన ఏవో ప్రకాష్, ఆర్వో నాజర్ హుస్సేన్, డీఈ మోహన్, ఏఈ పవన్‌కుమార్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్లు వినోద్ ప్రీతం, ఉమామహేశ్వర్ రెడ్డి ఆదివారం తమ విధుల్లో బిజీగా కనిపించారు. వీరికి మున్సిపల్ కార్యాలయ సిబ్బంది సహకరించారు. రెవెన్యూ, టౌన్ ప్లానింగ్, పారిశుధ్య విభాగాల్లో తనిఖీలు పూర్తి కాగా, అకౌంట్స్, ఇంజనీరింగ్ విభాగాల్లో కొనసాగుతోంది. సోమవారం నాటికి అకౌంట్స్ విభాగంలో తనిఖీలు పూర్తవుతాయని కమిటీలోని ఓ అధికారి తెలిపారు. ఇంజనీరింగ్ విభాగంలో తనిఖీలు ఈనెల 5వ తేదీ వరకు కొనసాగే అవకాశం ఉందన్నారు. పుత్తూరు మున్సిపాలిటీలో ప్రధానంగా ఇంజనీరింగ్ విభాగంలో అవినీతి చోటుచేసుకున్నట్లు ఫిర్యాదులు ఉండటంతో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు స్పష్టమవుతోంది.

బూదనం టోల్‌ప్లాజా వద్ద అఘోరి హల్‌చల్

చిల్లకూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): చిల్లకూరు మండలం బూదనం టోల్‌ప్లాజా వద్ద శనివారం అర్ధరాత్రి లారీల్లో గోవులను అక్రమంగా తరలిస్తున్నారని అఘోరి అడ్డుకుని కొద్దిసేపు హల్‌చల్ చేశారు. స్థానికుల వివరాల మేరకు.. పిఠాపురానికి చెందిన కొందరు రైతులు మదనపల్లె నుంచి రెండు లారీలలో గోవులను తీసుకెళుతున్నారు.అదే సమయంలో నెల్లూరు వైపు కారులో వెళుతున్న అఘోరి.. గోవులు తరలిస్తున్న లారీలను బూదనం టోల్‌ప్లాజా వద్ద అడ్డుకున్నారు. గోవులను వధించేందుకు అక్రమంగా తలిస్తున్నారని రైతులతో వాదనకు దిగారామె. తాము రైతులమని, వాటిని పెంచుకునేందుకు తీసుకెళుతున్నామని చెప్పినా వినలేదు.స్థానికుల సమాచారంతో అక్కడికి చేరుకున్న పోలీసులు.. అఘోరికి నచ్చచెప్పినా పట్టించుకోకుండా వారితోనూ వాదనకు దిగారు. ఆ తర్వాత రైతులు గోవులను తీసుకెళ్లారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

నేటి నుంచి ఇంటర్ సెకండియర్ పరీక్షలు

తిరుపతి(విద్య), మార్చి 2(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. జిల్లాలో 86 కేంద్రాల్లో 29,448 మంది జనరల్ విద్యార్థులు, 1100 మంది ఒకేషనల్ విద్యార్థులు మొత్తం 30,548 మంది పరీక్షలు రాయనున్నారు. ప్రథమ సంవత్సర పరీక్షలు శనివారం ప్రారంభమైన విషయం విదితమే.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సోమవారం) : 6.24
సహరి (మంగళవారం) : 5.09

ప్చ్.. పచ్చి మిర్చి

● దిగుబడి చేతికొచ్చే వేళ పడిపోయిన ధరలు

పచ్చి మిరప.. పంట చేతికొచ్చేసరికి ధరల ఘాటు తగ్గింది. పెట్టుబడి కూడా రాని పరిస్థితి తలెత్తింది. సముద్రతీర ప్రాంత మండలాలైన కోట, వాకాడు, చిట్టమూరులలో ఈ ఏడాది నేలబావులు, ఫిల్టర్‌పాయింట్లు, చెరువుల కింద రైతులు మిరప సాగు చేపట్టారు. మరోవైపు సీజన్‌లో వర్షాలు లేకపోవడం, నవంబరు నుంచి డిసెంబరు వరకు వరదలు ముంచెత్తడంతో వరి, వేరుశనగ, చెరకు పంటలను సాగుచేయలేక సూళ్లూరుపేట, నాయుడుపేట వ్యవసాయ సబ్ డివిజన్లలోని ఎక్కువమంది రైతులు పచ్చిమిర్చి వైపు దృష్టి పెట్టారు. దీంతో ఒకప్పుడు మెట్ట ప్రాంతాలకే పరిమితమైన మిర్చిని ఈ ప్రాంతాల్లోనూ దాదాపు 10 వేల ఎకరాలకుపైగా సాగు చేశారు. సూళ్లూరుపేట ప్రాంతంలోని మంగళంపాడు, మతకాముడి, ఉగ్గుముడి, సుగ్గుపల్లి, మంగానెల్లూరు, దామానెల్లూరు, వెలగలపొన్నూరు, ఉచ్చూరు ప్రాంతాల్లో విస్తృతంగా మిరప సాగు చేపట్టారు. తెగుళ్ల బారి నుంచి పంటను కాపాడుకున్నారు. గతేడాదికంటే ఈసారి పచ్చి మిరప కాయలు ఎక్కువ దిగుబడి వచ్చాయి. అదే సమయంలో ధరలు పడిపోవడంతో రైతులు కుమిలిపోతున్నారు. సూళ్లూరుపేట ప్రాంతంలో రైతులు మేలురకం మిరప జాతులైన ఇండాం-5, ఇండాం-67, ప్రియాంక, వజ్ర, నాందారి, సున్నా-56, జేకే రకాలను సాగు చేసి.. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించేవారు. దీంతో ఎకరాకు రూ.లక్షకు పైగా ఆదాయాన్ని పొందేవారు. ఇప్పుడు దిగుబడుల వేళ కిలో రూ.13 నుంచి రూ.15 మధ్యలో ధర పలకడంతో నష్టపోతున్నారు. గతేడాది అక్టోబరులో కిలో మిర్చి రూ.30 నుంచి రూ.40 వరకు ధర పలికేది. గతేడాఇ ఇదే సీజన్‌లో కిలో రూ.40 నుంచి 60 వరకు కూడా పలికింది. పండు మిర్చి కూడా ఒకప్పుడు కిలో రూ.220 ఉండగా నేడు రూ.100 నుంచి రూ.120కి పడిపోయింది.





తప్పని నష్టం

ఎకరా మిర్చి సాగుకు రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకు ఖర్చవుతోంది. ప్రస్తుతం మిర్చి ధర మార్కెట్‌లో టన్ను రూ.10 వేల నుంచి రూ.13 వేలు మాత్రమే పలుకుతోంది. ఎకరాకు 5 టన్నుల దిగుబడి వచ్చినా నష్టం చవిచూడక తప్పడం లేదు. అధిక పెట్టుబడులు పెట్టి ఏపుగా పంటను పండించిన రైతులు నేడు ధరలు పడిపోవడంతో నష్టాలకు అమ్ముకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక, కోట ప్రాంతంలో ఎక్కువగా కౌలు రైతులు ఒక్కో ఎకరాన్ని సీజన్‌ను బట్టి రూ.25వేల నుంచి రూ.30వేల వరకు తీజుకు తీసుకుని మిరపసాఆగు చేపట్టారు. పెట్టుబడులు, లీజులుకూడా రాకపోవడంతో (ధరలపరంగా) వీరంతా లబోదిబోమంటున్నారు. ప్రస్తుతం ఆయా మండలాలలో పచ్చి మిరపకాయలను అమ్ముకొని చివరితడిలో పండు మిరపకాయలుగా ఎండబెట్టి సొమ్ము చేసుకునే ప్రయత్నాల్లో ఉన్నారు.

- కోట/సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి



జోరుగా గ్రామీణ రోడ్ల నిర్మాణం

రామచంద్రాపురం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో రోడ్ల నిర్మాణం ఊపందుకుంది. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం రోడ్ల గురించి పట్టించుకోకపోవడంతో ప్రజలు ఇబ్బందిపడ్డారు. ఎన్నికల ముందు ఆర్‌సీపురం మండలంలో ప్రచారానికి వచ్చిన ఎమ్మెల్యే పులివర్తి నాని గ్రామాల్లోని రోడ్లను చూసి అధికారంలోకి వచ్చిన వెంటనే బాగు చేస్తామని హామీ ఇచ్చారు. ఆ మేరకు అనుపల్లి, బొప్పరాజుపల్లె, నెత్తకుప్పం, మిట్టూరు, శ్రీరామపురం, పరమాల, కమ్మపల్లె గ్రామాల్లో 26 పనులకు గాను రూ.6.13కోట్ల ఉపాధి నిధులు మంజూరు చేయించారు. వివిధ దశల్లో పనులు జరుగుతున్నాయి. దశాబ్దాల పాటు ప్రతిపాదనలకే పరిమితమైన గుండోడు కనుమ రోడ్డు రూ.7కోట్లతో శరవేగంగా జరుగుతోంది. ఈ పనులన్నీ త్వరితగతిన పూర్తయ్యేలా ఎమ్మెల్యే పర్యవేక్షిస్తున్నారు.



అనుపల్లి వద్ద నిర్మిస్తున్న సిమెంటు రోడ్లు

తిరుచ్చిపై సుందరరాజస్వామి అభయం



మాడవీధుల్లో ఊరేగుతున్న సుందరాజస్వామి

తిరుచానూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరులో కొలువై ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత సుందరరాజస్వామి ఆదివారం బంగారు తిరుచ్చిపై తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. స్వామివారి జన్మనక్షత్రం ఉత్తరాబాధ్రను పురస్కరించుకుని ఆలయంలో అర్చకులు విశేష పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవర్లకు అభిషేకం చేశారు. రాత్రి తిరువీధి ఉత్సవం నిర్వహించారు. డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో దేవరాజులు, ఏవీఎస్వో సతీష్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సుభాస్కర్‌నాయుడు, చలపతి, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన



తిరుచానూరు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు రోడ్డు లోని శిల్పారామంలో వారాంతపు సెలవులో భాగంగా బెంగళూరుకు చెందిన అమృతవర్షిణి ఫౌండేషన్ ఫర్ ఆర్ట్స్ కళాకారులు ఆదివారం ప్రదర్శించిన నృత్యరూపకం అలరించింది. కళాకారులు ఇర్షికా ఎస్.కృష్ణమూర్తి, విద్యా విశ్వనాథన్, ఆదితి ఉల్లాల్, జీవిత, దేవి సంవర్ధిని, కీర్తి వర్ధిని తదితరులు పుష్పాంజలి, గజాననయుతం, శ్రీమన్నారాయణ, వర్ణం, చంద్రచూడ, థిల్లానా, పాండురంగాష్టకం వంటి కీర్తనలకు కూచిపూడి నృత్య ప్రదర్శన చేశారు. వీరిని శిల్పారామం ఏవో ఖాదరవల్లి సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న డ్రైవర్

చంద్రగిరి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఆవును ఢీకొందని డ్రైవర్‌పై దాడి చేసిన ఘటన మండలంలోని ఎం.కొత్తపల్లె వద్ద ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. పాకాల నుంచి తిరుపతి వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు మండలంలోని ముంగిలపట్టు వద్ద ఆవును ఢీకొనడంతో అది అక్కడికక్కడే మృతి చెందింది. డ్రైవర్ బస్సును నిలపకుండా వెళుతుండడంతో ఆవు యజమాని, ముంగిలిపట్టు గ్రామస్తులు వెంబడించాడు. ఎం.కొత్తపల్లె వద్ద ఆపి డ్రైవర్ మునిపై దాడి చేశారు. అతని తలకు గాయం కావడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. చికిత్స నిమిత్తం 108 వాహనంలో చంద్రగిరి ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. కేసు నమోదు కాలేదు.

ప్రాణాలతో చెలగాటం!

'మేము ఏమి చేసేది చెప్పండి. నాయకుల సిఫార్సు తెస్తారు. చూసీచూడకుండా ఉండిపోవడం తప్ప ఏమీ చేయలేకపోతున్నాం. ఎక్కడైనా చావులు సంభవిస్తే మళ్లీ అంతా మా నెత్తిమీదికే వస్తుంది.' ..ఎద్దుల పండుగ పేరుతో జరిగిన జల్లికట్టులో ఇటీవల చోటుచేసుకున్న మృతిపై ఓ పోలీసు ఆఫీసరు ఆవేదన

'ప్రజా ప్రయోజనాలు, పార్టీ ప్రయోజనాల దృష్ట్యా ఈరోజు నుంచి కుప్పం మండలంలో ఎద్దుల పండుగను నిషేధించడమైనది. ఎవరైనా అతిక్రమించి నిర్వహించిన ఎడల, పార్టీ నాయకులకు ఎటువంటి సంబంధం లేదని తెలియజేసుకుంటున్నాము. నిర్వహించిన వారిపై పోలీసులు చట్టపరంగా చర్యలు తీసుకుంటారు.' ..ఇది ఒక మండల టీడీపీ నాయకులు పత్రికలకు విడుదల చేసిన ప్రకటన.

ఈ రెండు స్టేట్‌మెంట్లలో ఏది నిజం? కుప్పం నియోజకవర్గవ్యాప్తంగా జనవరి నెల ప్రారంభమైంది మొదలు, మార్చి నెల చివరి దాకా ఈ ఎద్దుల పండుగలు ప్రతి పంచాయతీలోని ఏదో ఒక గ్రామంలో జరుగుతూనే ఉంటాయి. జల్లికట్టు తరహా ఎద్దుల పందేలు, వాటిని నిలువరించడానికి యువకుల మధ్య పోటీలు, ఈ క్రమంలో గాయాలపాలై ఆస్పత్రులకు చేరడాలు.. అన్నీ జరుగుతున్నాయి. చివరకు ఒక యువకుడు తీవ్రంగా గాయపడి మృతి చెందాక కూడా కుప్పం మండలం మల్లానూరు పంచాయతీ పొన్నాంగూరు గ్రామంలో యథేచ్ఛగా సాగిన ఎద్దుల పందేలు, పలువురి గాయాలకు కారణమయ్యాయి.

కుప్పం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): నిజానికి సంక్రాంతి పర్వాన్ని పురస్కరించుకుని కనుమ పండుగ రోజున వ్యవసాయానికి, పాడికి ఉపయోగించే పశువులను పూజించి, అలంకరించి వీధుల్లో వదలడం తెలుగు నేలలో వస్తున్న ఆనవాయితీ. అయితే దీన్నే కుప్పం నియోజకవర్గ గ్రామాలు ఎద్దుల పండుగ అని ఒకప్పుడు పిలుచుకునేవి. క్రమేణా ఈ ఎద్దుల పండుగ కాస్తా, ప్రాణాలు తీసే జల్లికట్టుగా రూపాంతరం చెందింది. 'గొప్ప ఎద్దుల పండుగ' పేరుతో బహుమతులు ప్రకటించి ప్రచార కరపత్రాలు, పోస్టర్లు ముద్రించి ఊరూవాడా ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. పేరుకు పండుగే అయినా ఆ పేరుతో ఎద్దుల మధ్యే కాదు, వాటిని నిలువరించడానికి ప్రాణాలను లెక్క చేయకుండా ముందుకు దూకే యువకుల మధ్య కూడా ఈ సందర్భంగా పోటీ పెడతారు. విజేతలకు రూ.వేలల్లో నగదు బహుమతులతోపాటు, ఇంకా పలురకాల బహుమానాలు అందజేస్తారు. పొగరుబోతు ఎద్దులను నిలువరించే క్రమంలో తమ బలాన్ని నిరూపించుకుని సమీప గ్రామాల్లో వీరుడిగా పేరు పొందాలన్న తహతహ యువకులను ఈ పోటీలకు పురికొల్పుతోంది.

వైసీపీ ఆదర్శంగా

వైసీపీ అధికారంలో ఉన్న అయిదేళ్ల కాలంలో జల్లికట్టు ఫీవర్ కుప్పం నియోజకవర్గాన్ని ఊపేసింది. ఎక్కడపడితే అక్కడ ఎప్పుడు పడితే అప్పుడు వేలు, లక్షల రూపాయలు బహుమతులు ప్రకటించి భారీ స్థాయిలో అట్టహాసంగా ఎద్దుల పండుగ పేరుతో జల్లికట్టు నిర్వహించేవారు. ఏకంగా వైసీపీ ప్రధాన నాయకులు, వారి అనుచరులే రంగంలోకి దిగి హంగామా చేసేవారు. వారి ఆధ్వర్యంలోనే పోటీలు జరిగేవి. పోలీసు యంత్రాంగం ప్రేక్షకపాత్ర వహించేది. జల్లికట్టు సందర్భంగా ఎక్కడ ఎటువంటి మరణాలు సంభవించినా బయటకు వచ్చేవి కావు. కేసులు నమోదైన దాఖలాలు కూడా లేవు. ఇప్పుడదే బాటలో తెలుగు తమ్ముళ్లు కూడా నడుస్తున్నారు. నిజానికి జనవరి నెల మొత్తం జల్లికట్టు ఊసే లేదు. ఎక్కడైనా ఒకటీ అరా ఎద్దుల పండుగలు జరిగినా, పెద్దగా ప్రాణాంతక సంఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో కొనసాగేవి. పార్టీ అధినేత చంద్రబాబు నియోజకవర్గం కావడంతో ఆయనమీద ఉన్న భయంతో టీడీపీ నాయకగణం ఇందులో జోక్యం చేసుకోవడానికి భయపడి దూరంగా ఉండేది. కానీ ఫిబ్రవరి నెల ప్రారంభమైనది మొదలు నియోజకవర్గంలో గ్రామ గ్రామానా జల్లికట్టు ఊపందుకుంది. ఒకరొకరుగా స్థానిక నాయకగణం వీటి నిర్వహణలో నేరుగా జోక్యం చేసుకోవడం ప్రారంభమైంది. మొదట్లో అడ్డుకోవడానికి ప్రయత్నించిన పోలీసు యంత్రాంగాన్ని నయానో భయానో నియంత్రించి ఇష్టారాజ్యంగా ఎద్దుల పండుగ పేరుతో జల్లికట్టు పోటీలు నిర్వహిస్తున్నారు.

ప్రాణాలు పోయినా

ఎద్దుల పండుగ పేరుతో నిర్వహించే జల్లికట్టు పక్కా వ్యాపారమయంగా మారిపోయింది. స్థానికంగా అధికార పార్టీకి చెందిన నాయకులు లేదా పలుకుబడి కలిగిన కొంతమంది జట్టుగా ఏర్పడి జల్లికట్టు నిర్వహిస్తున్నారు. లక్షలాది రూపాయల బహుమతులు ప్రకటిస్తున్నారు. అయినా వ్యాపారం ఎందుకైందంటే, వీరు ప్రకటించిన బహుమతుల మొత్తంకంటే టోకెన్ ధర పేరుతో వసూలు చేస్తున్న ప్రవేశ రుసుం ద్వారా చాలా అధిక మొత్తం నిర్వాహకుల జేబుల్లోకి చేరుతోంది. ఒక్క

● ఎద్దుల పండుగ పేరుతో పకడ్బందీ వ్యాపారం

ఆంధ్రానుంచే కాక, సరిహద్దుల్లోని తమిళనాడు, కర్ణాటక గ్రామాలనుంచి వేల సంఖ్యలో ఎద్దులను ఈ జల్లికట్టు పోటీలకు తీసుకు వస్తుండడమే దీనికి కారణం. మల్లానూరు పంచాయతీ పొన్నాంగూరు గ్రామంలో గత నెలలో జరిగిన జల్లికట్టులో కరుణాకరన్ అనే యువకుడు తీవ్ర గాయాలపాలై చికిత్స పొందుతూ పక్కరోజు మృతి చెందాడు. అయినా సరే, జల్లికట్టు నిర్వహించడం మాత్రం ఆగడం లేదంటే కుప్పం నియోజకవర్గం ఈ ప్రాణాంతకమైన సంబరంలో ఎంతగా కూరుకుపోయిందో అర్థమవుతుంది.

లాభం ఎలాగంటే..

జల్లికట్టులో పాల్గొనే ఎద్దులకు ప్రవేశ రుసుం రూ.3వేలనుంచి 4వేలదాకా వసూలు చేస్తారు. బహుమతుల విషయానికి వస్తే సుమారు వంద దాకా ఉంటాయి. మొదటి మూడు బహుమతులు రూ.లక్ష, రూ.75వేలు, రూ.50వేలు ఉంటాయి. 500 ఎద్దులు పాల్గొనే జల్లికట్టుకు రూ.5లక్షల నుంచి 6లక్షల దాకా నిర్వహణ ఖర్చుంటుంది. ఈ ఖర్చు పోనూ దాదాపు రూ.8లక్షల నుంచీ రూ.9లక్షల దాకా నిర్వాహకులకు మిగులుతోంది. ఎద్దుల సంఖ్య పెరిగే కొద్దీ నిర్వాహకులకు ఆదాయం కూడా పెరుగుతుంది.

చట్టపరమైన చర్యలు తప్పవు



మేము ఎద్దుల పండుగ నిర్వహించుకోవడానికి అధికారికంగా ఎటువంటి పర్మిషన్ ఇవ్వలేదు. స్థానికంగా సంప్రదాయంగా వస్తున్న పండుగ అని చెబుతున్నారు నిర్వాహకులు. అయితే ఎద్దుల పండుగ నిర్వాహకులను ముందుగానే బైండోవర్ చేసుకుంటున్నాం. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నాం.

\- డీఎస్పీ పార్థసారథి



చిక్కపల్లె తాండాలో..

రామకుప్పం మండలం చిక్కపల్లెతాండాలో ఆదివారం మైలేరు పండుగ (ఎద్దులపరుగుపందేలు) కోలాహలంగా జరిగింది. గ్రామం జనసంద్రంగా మారింది. ఎద్దులను నిలువరించేందుకు యువకులు పోటీపడ్డారు. మన జిల్లాతోపాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి 170కి పైగా ఎద్దులను తీసుకొచ్చారు.

\- రామకుప్పం, ఆంధ్రజ్యోతి



జాలారిపల్లెలో..

జాలారిపల్లె గ్రామంలోనూ ఆదివారం మైలేరుపండుగ కోలాహలంగా జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి ఎద్దులను తీసుకొచ్చి అల్లిలోకి వదిలారు. వీటిని నిలువరించడానికి యువకులు పోటీపడ్డారు.

\- బైరెడ్డిపల్లె, ఆంధ్రజ్యోతి

పచ్చని చెట్లపై గొడ్డలి వేటు

● ఎడారిగా మారుతున్న గ్రామాలు
● అమలుకు నోచుకోని వాల్టా చట్టం





కోగిలి వద్ద రోడ్డు పక్కన నరికివేసిన వేప చెట్టు - కొత్తగుంట పెట్రోలింగ్ సమీపంలో నిల్వ చేసిన వేప, కానుగ, కరతుమ్మ చెట్ల కలప

చిట్టమూరు, మార్చి2 (ఆంధ్రజ్యోతి): మొక్కలు నాటాలి... పర్యావరణాన్ని కాపాడాలన్న ప్రభుత్వ లక్ష్యం నీరు గారుతోంది. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ప్రభుత్వంతో పాటు పర్యావరణ పరిరక్షణ సంస్థలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా ఫలితం లేకుండా పోతోంది. చెట్లను రక్షించే వాల్టా చట్టం అమలుకు నోచుకోవడం లేదు. కొందరు అక్రమార్కులు యథేచ్ఛగా చెట్లను నరికి కలప విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. మండలంలో ఇటుక బట్టీలు, బొగ్గు తయారీకి కలప అవసరం కావడంతో డిమాండ్ నెలకొంది. దీంతో ప్రభుత్వ భూములు, ప్రధాన రహదారులకు ఇరువైపులా ఉన్న భారీ వృక్షాలపై అక్రమార్కులు కన్నేశారు. కరతుమ్మ చెట్ల నుంచి వేప వరకు ఏదీ వదిలి పెట్టకుండా నరికేస్తున్నారు. మండలంలో తీరప్రాంత గ్రామాలైన కోగిలి, ఎల్లూరు, బురదగాలి, కొత్తపాళెం, కుమ్మరిపాళెం గామాల్లో కరతుమ్మ చెట్లు అత్యధికంగా ఉన్నాయి. ఈ చెట్లను నరికేందుకు ఎటువంటి అనుమతులు లేకపోవడంతో యథేచ్ఛగా నరికి విక్రయాలు సాగిస్తున్నారు. ఇక ఇంటి గృహోపకరణలకు కిటికీలు, ద్వార బంధనాలకు, వేప కొయ్యను ఎక్కువగా వాడుతుంటారు. అటువంటి విలువైన చెట్లను నరికి కోట, నాయుడుపేట ప్రాంతాల్లోని కొయ్య మిల్లులకు, ఇటుక బట్టీలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. విచ్చలవిడిగా చెట్లను నరికి తరలిస్తున్నా అధికారులు నిమ్మకునీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మండలంలో వృక్ష సంపదను పరిరక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రైవేటు వెంచర్ కోసం కల్వర్టు ధ్వంసం

దర్జాగా కన్నలికాలువ స్థలంపై దారి



కాలువ భూమిలో కల్వర్టు ధ్వంసం చేసి ఏర్పాటు చేసిన దారి

శ్రీకాళహస్తి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు వెంచర్ కోసం దర్జాగా కల్వర్టును ధ్వంసం చేస్తున్నారు. ఇష్టారాజ్యంగా కన్నలి కాలువ స్థలంపై దారి ఏర్పాటు చేసేస్తున్నారు. తొట్టంబేడు మండలం బసవయ్యపాళెంలో ఆదివారం జరిగింది. శ్రీకాళహస్తికి ఆనుకుని బసవయ్యపాళెం ఉండడమే కాకుండా పట్టణంలో కలిసిపోవడంతో ఇక్కడ భూములకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. నెల్లూరు నుంచి శ్రీకాళహస్తిలోకి వాహనాలు ప్రవేశించే నంది కూడలి కూడా బసవయ్యపాళెంలోనే ఉంది. నంది కూడలి నుంచి తొట్టంబేడు వద్ద భక్తకన్నప్ప కూడలి వరకు ఇటు నెల్లూరు, అటు చెన్నై రెండు రహదారులను కలిపేందుకు వంద అడుగుల వెడల్పుతో కొత్త బైపాస్‌రోడ్డును నిర్మించారు. దీంతో ఇక్కడ భూములకు అమాంతంగా రెక్కలొచ్చాయి. ఇటీవల నంది కూడలి పక్కనే నాయుడుపేట - తిరుపతి ఆరులేన్ల జాతీయ రహదారి కొత్తగా ఏర్పడింది. సరిగ్గా నంది కూడలి, రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌కు వెనుక వైపున వంద మీటర్ల దూరంలో శ్రీకాళహస్తి పట్టణం నుంచి తొట్టంబేడు మండలం కన్నలి వరకు డ్రైనేజీ కాలువ ఉంది. ఈ కాలువపై కొత్త బైపాస్‌రోడ్డు నిర్మాణంలో భాగంగా కల్వర్టును నిర్మించారు. కన్నలి కాలువ సుమారు 80 అడుగుల వెడల్పుతో సాగుతోంది. కాలువ భూమిపై కొందరు రియల్‌ఎస్టేట్ వ్యాపారులు కన్నేశారు. తమ భూములకు బైపాస్ నుంచి రోడ్డు ఏర్పాటు చేస్తే స్థలాలను అధిక ధరలకు అమ్ముకోవచ్చని పథకం వేశారు. సరిగ్గా పక్కనే కాలువ భూమిపై రోడ్డు వేసేందుకు కసరత్తు ప్రారంభించారు. ఆదివారం అధికార యంత్రాంగం సెలవులో ఉండటంతో కల్వర్టు దక్షిణం వైపున కొంత భాగాన్ని యంత్రాలతో ధ్వంసం చేశారు. కన్నలి కాలవ దక్షిణవైపు కట్టను దారి కోసం చదును చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కన్నలి కాలువను పరిరక్షించాల్సిన అవసరం ఉంది.

మోటరు సైకిల్‌ను ఢీకొన్న కారు

ఒకరి మృతి, మరొకరికి తీవ్ర గాయాలు



మురళీరెడ్డి (ఫైల్‌ఫొటో)

గూడూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నూరు సమీపంలో మోటారు సైకిల్‌ను వెనుక నుంచి కారు ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందగా, మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. రూరల్ ఎస్‌ఐ మనోజ్‌కుమార్ వివరాల మేరకు... మండలంలోని చెన్నూరు గ్రామానికి చెందిన అల్లూరు మురళీరెడ్డి(58), రమణారెడ్డి ఆదివారం వేకువజామున గ్రామ సమీపంలోని కటాలమ్మగుడి వద్ద వాకింగ్ చేసేందుకు వెళ్లారు. తిరిగి మోటరుసైకిల్‌పై గ్రామానికి వస్తుండగా ఆలయ సమీపంలో తిప్పవరప్పాడు నుంచి గూడూరు వైపు వెళుతున్న ఓ కారు అదుపుతప్పి ముందు వెళుతున్న మోటరుసైకిల్‌ను వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో మురళీరెడ్డి అక్కడికక్కడికే మృతిచెందగా, రమణారెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. రమణారెడ్డికి స్థానిక ఏరియా ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. మురళీరెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో విద్యార్థి మృతి



సూరి (ఫైల్ ఫొటో)

గంగాధరనెల్లూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతానికి గురై ఓ విద్యార్థి మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గంగాధర నెల్లూరు మండలంలోని కట్టకిందపల్లె దళితవాడకు చెందిన మాధవి, దినకరన్‌ల మూడో కుమారుడు సూరి (13) ఎట్టేరి శ్రీభానోదయ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో ఏడో తరగతి చదువుతున్నాడు. చర్చిలో ప్రార్థనల సందర్భంగా ఆదివారం ఉదయం మైక్‌సెట్ సరిచేస్తున్న క్రమంలో సూరి.. విద్యుదాఘాతానికి గురయ్యాడు. బాలుడిని 108 వాహనంలో చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. విద్యార్థి మృతికి సంతాపంగా భానోదయ ఇంగ్లీష్ మీడియం హైస్కూలుకు సోమవారం సెలవు ప్రకటించినట్లు కరస్పాండెంట్ మద్దిపట్ల నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ లావణ్య తెలిపారు. విద్యార్థి మృతిపై తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

మూడేళ్ల క్రితం ఫిర్యాదు: వీజే క్వారీ సీజ్

కేవీబీపురం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరిందేశం రెవెన్యూలో మఠం గ్రామం వద్ద ఉన్న వీజే క్వారీని తాత్కాలికంగా మూసివేయాలని కాలుష్య నివారణ అధికారి రాజశేఖర్ ఆదేశాలు ఇచ్చారు. వివరాల్లోకి వెళితే... ఈ క్వారీ కారణంగా చుట్టుపక్కల ఉన్న 15 గ్రామాలు కాలుష్యానికి గురై స్థానికులు అనారోగ్య బారిన పడుతున్నారు. దీనిపై 2023లో కాలుష్య నియంత్రణ అధికారులకు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి పలుమార్లు వచ్చి తనిఖీలు నిర్వహించారే తప్ప చర్యలు తీసుకోలేదు. అయితే ఎట్టకేలకు శనివారం అధికారులు ఈ క్వారీకి సంబంధించిన విద్యుత్ సరఫరాను ఏఈ మునికుమార్ నిలిపివేశారు. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు క్వారీని మూసివేయాలని, పనులు నిర్వహించ రాదని పీసీబీ అధికారులు పేర్కొన్నారు. దీంతో బ్రాహ్మనపల్లి, కండ్లూరు, బ్రాహ్మణచెరువు, గురుకులకండ్రిగ, కేపీపురం, మఠం, రాగిగుంట, పెరిందేశం తదితర గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కేవీబీపురం పీహెచ్‌సీలో

వైద్యులకు నైట్ డ్యూటీలు వేయరూ!

కేవీబీపురం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో రాత్రివేళ వైద్యులను నియమించాలని మండలవాసులు కోరుతున్నారు. సుమారు 45 వేలమంది జనాభా కలిగిన ఈ మండలానికి వైద్యకేంద్రం ఉన్నా పగటి పూట మాత్రమే వైద్యులు, సిబ్బంది ఉంటున్నారు. రాత్రి వేళల్లో నామమాత్రంగా స్టాఫ్ నర్సును డ్యూటీలో ఉంచుతున్నారు. అయితే రాత్రి వేళల్లో ఏదీ జరిగినా స్టాఫ్ నర్సే ప్రథమ చికిత్స అందించాల్సి వస్తోంది. వైద్యులు లేకపోవడంతో తిరుపతికి లేదా, శ్రీకాళహస్తికి రెఫర్ చేస్తారు. అది కూడా అంబులెన్సు అందుబాటులో ఉంటేనే. లేని పక్షంలో తెల్లారిన తరువాత వైద్యులు వచ్చే వరకు వేచ ఉండాల్సిందే. ఎక్స్‌రే, ఆపరేషన్లు తప్పితే అన్ని హంగులతో ఆస్పత్రిని ఏర్పాటు చేశారు. దీంతో పాటు ఇక్కడ సిబ్బంది ఉండటానికి క్వార్టర్స్‌ను కూడా ఏర్పాటు చేశారు. కానీ ఇక్కడ ఎవరూ సిబ్బంది ఉండడం లేదు. పగటి పూట రావడం.. విధులు నిర్వహించి తిరిగి వెళ్లిపోతుంటారు. ఇంత పెద్దమండలానికి రాత్రి వేళల్లో వైద్యులు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి రాత్రి వేళల్లో సిబ్బంది ఇక్కడ ఉండే విధంగా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

పాళెంకోటలో ప్రభుత్వ భూముల కబ్జా



ప్రభుత్వ భూములను చదును చేసేందుకు చెట్లను తొలగించిన దృశ్యం

వెంకటగిరి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి సమీపంలోని పాళెంకోట గ్రామ సర్వే నెంబరు 4,5,6,7,8లో సుమారు 83 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జా జరుగుతోంది. మూడు రోజులుగా యంత్రాలతో ప్రభుత్వ భూమి చేస్తున్నా అధికారులు ఎవరూ పట్టించుకోవడంలేదు. మూడు రోజుల నుంచి ఎక్స్‌కవేటర్లు, డోజర్ల సాయంతో చెట్లు తొలగించి చదును చేస్తున్నా రెవెన్యూ అధికారులు అటు వైపు కన్నెత్తి చూడటం లేదని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి పాళెంకోటలో ప్రభుత్వ భూములను కబ్జాదారుల నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



లెమన్ స్పూన్ ఆడుతున్న మహిళా ఉద్యోగులు

తిరుపతి(వైద్యం), మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మహిళలు కుటుంబ, ఉద్యోగ బాధ్యతలతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మబ్బు దేవనారాయణరెడ్డి అన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏపీ హంస ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాజా ఆధ్వర్యంలో నెహ్రూ మున్సిపల్ క్రీడా మైదానంలో ఆదివారం మహిళా ఉద్యోగులకు పలు క్రీడా పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన దేవనారాయణరెడ్డి మాట్లాడుతూ మహిళలకు క్రీడా పోటీలు మానసికోల్లాసాన్ని ఇస్తాయన్నారు. లెమన్ స్పూన్, తాడు లాగుడు, పరుగు పందెంలో విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఉమెన్స్ డే కమిటీ సభ్యులు టాటాబాయ్, రోహిణి, రాజేశ్వరి, పద్మజ, జ్యోతిలక్ష్మి, ఏపీ హంస నేతలు ఇమ్రాన్, గీత, వెంకటసుబ్బమ్మ, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆలిండియా పోస్టల్ క్యారమ్స్ టోర్నీ



లోగోను ఆవిష్కరిస్తున్న సంతోష్‌నేత

తిరుపతి(క్రీడలు), మార్చి 2 (ఆంధ్రజ్యోతి): తపాల ఉద్యోగుల్లో ఐక్యత పెంచేందుకు ఏపీ పోస్టల్ సర్కిల్ ఆధ్వర్యంలో తిరుపతిలో సోమవారం నుంచి ఐదు రోజుల పాటు ఆలిండియా పోస్టల్ క్యారమ్స్ టోర్నమెంటు నిర్వహిస్తున్నట్లు ఏపీ ముఖ్య పోస్టుమాస్టర్ కె.సంతోష్‌నేత తెలిపారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇందిరా మైదానంలోని మల్టీ స్పోర్ట్స్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్న ఈ టోర్నీ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా ఎస్వీయూ వీసీ సీహెచ్ అప్పారావు హాజరవుతారని పేర్కొన్నారు. అనంతరం టోర్నీకి సంబంధించిన లోగోను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ పోస్టుమాస్టర్ జనరల్ కె.ప్రకాష్, తిరుపతి ఎస్పీవో బి.నారాయణప్ప, వెంకటరెడ్డి, సతీష్ పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి





జస్టిస్ సుజన, కేశబ్ మహంత, అతుల్ బోరా

తిరుమల, మార్చి2(ఆంధ్రజ్యోతి): తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.సుజన ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో కుటుంబ సమేతంగా ఆలయంలోకి వెళ్లిన ఆమె ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. అనంతరం రంగనాయక మండపానికి చేరుకున్న సుజనకు వేదపండితులు ఆశీర్వచనం చేయగా అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు. అలాగే అసోం రాష్ట్ర మంత్రులు కేశబ్ మహంత, అతుల్ బోరా కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

ఉత్సాహంగా ఎదురుసేవ



గిరిప్రదక్షిణకు బయలుదేరుతున్న స్వామిఅమ్మవార్లు

శ్రీకాళహస్తి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): కైలాసగిరి ప్రదక్షిణ పూర్తిచేసుకుని తిరిగి వస్తున్న స్వామిఅమ్మవార్లకు ఎదురు వెళ్లి స్వాగతం పలికే ఎదురుసేవను ఆదివారం భక్తులు ఎంతో ఉత్సాహంగా జరుపుకున్నారు. ఉదయం ఆలయం నుంచి వెళ్లిన స్వామి అమ్మవార్లు కైలాసగిరుల ప్రదక్షిణ చేసుకుని సాయంత్రం తిరిగి ఆలయం సమీప ప్రాంతం కోనేటిమిట్ట వద్దకు చేరకుంటారు. ఇక్కడికి గిరిప్రదక్షిణకు వెళ్లలేని భక్తులు పెద్దఎత్తున ఎదురువెళ్లి అక్కడ స్వాగతం పలకడం ఆనవాయితీ. ఇందు కోసం పిల్లలు, పెద్దలు ముందుగా ఎదురుసేవ మండపం వద్దకు చేరుకున్నారు. స్వామిఅమ్మవార్లు వచ్చేలోగా స్వర్ణముఖి నదిలో ఆట పాటలతో ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు.

భక్తులకు సేవలు... శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఆ దివారం స్వామిఅమ్మవార్ల గిరిప్రదక్షిణ జరిగింది. ఈ సందర్భంగా వేలాదిమంది భక్తులు స్వామి అమ్మ వార్ల వెంట నడిచారు. భక్తులకు పలు సేవా సంఘాలు అన్నదానం, మజ్జిగ, మంచినీరు పంపిణీ చేశాయి. భక్తకంనేశ్వర సేవాసంఘం తరఫున భక్తులకు అన్నదానం జరిగింది. అదే విధంగా జనసేన, బలిజ సేవా సంఘం ఆధ్వర్యంలో సుమారు 2వేలమంది భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కావలి శివకుమార్, వెంకటేష్, సురేష్, లక్ష్మి, రాజ్యలక్ష్మి, యామిని తదితరులు పాల్గొన్నారు.

నందడే నందడి... కైలాసగిరి ప్రదక్షిణ ఆద్యంతం ఆధ్యాత్మికత అనుభూతితో సాగిఅడుగడుగునా సందడిగా జనం సాగిపోయారు. దారిపొడవునా చెట్లు, కొండల నీడలో సేద తీరారు. ఇక విడిది మండపాల వద్ద దాతలు అందించే ఆహార, పానీయాలను స్వీకరించారు. అంజూరు మండపం ఎదురుగా ఉన్న కైలాసగిరి రిజర్వాయరు వద్ద నీటిమట్టం అనువుగా ఉండటంతో పిల్లలు, పెద్దలు సరదాగా ఈత కొట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ తీవ్రతకు ఈత సరదా ఉపశమనం కలిగించింది.



స్వామివార్లను అనుసరిస్తున్న జనం

తిరుపతి

శ్రీవారి సర్వదర్శనానికి 8 గంటలు

తిరుమల, మార్చి2(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 16 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శుక్రవారం నాటి హుండీ ఆదాయం : **రూ.2.84 కోట్లు**
శనివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : **71,785**
తలనీలాలు సమర్పించినవారు : **23,481**

26న అన్నమాచార్య వర్ధంతి

తిరుమల, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): తెలుగు తొలి వాగ్గేయకారుడు, పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల వర్ధంతి ఈనెల 26వ తేదీన తిరుమలలో నిర్వహించనున్నారు. ఆ రోజు సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి ఊరేగింపుగా శ్రీవారి ఆలయం నుంచి బయల్దేరి నారాయణగిరి ఉద్యానవనంలోని పద్మావతి పరిణయోత్సవ వేదికపైకి వేంచేపు చేస్తారు. ప్రముఖ కళాకారులతో దినము ద్వాదశి సంక్తీనలు, సప్తగిరి సంకీర్తనల గోష్ఠిగానం నిర్వహిస్తారు. పలువురు పీఠాధిపతులు అనుగ్రహభాషణం చేస్తారు. చివరిలో తాళ్లపాక వంశీయులకు సన్మానం చేస్తారు.

కొనసాగిన వెటర్నరీ విద్యార్థుల సమ్మె



నిరసన తెలుపుతున్న వెటర్నరీ విద్యార్థులు

తిరుపతిరూరల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్యార్థులతో సమానంగా స్టైఫండ్ పెంచాలని ఎస్వీ వెటర్నరీ కళాశాల విద్యార్థులు చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారమూ కొనసాగింది. వర్సిటీ ప్రధానగేటు ఎదుట ఏర్పాటు చేసిన దీక్షా శిబిరంలో విద్యార్థులు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ప్లకార్డులు చేతబట్టి తమకు న్యాయం చేయాలని కోరారు. 28 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం గానీ వర్సిటీ అధికారులుగానీ తమ గోడును ఆలకించడంలేదని వాపోయారు. ఇప్పటికైనా స్పందించి న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

సీఓసీ బిల్డింగ్ నిర్మాణం వేగవంతం

నాడు రెండేళ్లలో పాతిక శాతమే ● నేడు 8 నెలల్లో 80 శాతం పూర్తి ● మరో నాలుగు నెలల్లో అందుబాటులోకి..



ఎన్నికల ముందు సీఓసీ బిల్డింగ్,



ప్రస్తుతం ఇలా..

తిరుపతి, మార్చి2 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగర నడిబొడ్డున సిటీ ఆపరేషన్ సెంటర్ (సీఓసీ) పేరిట మున్సిపల్ కార్పొరేషన్ భవన నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. గత వైసీపీ హయాంలో రెండేళ్లపాటు పాతిక శాతం కూడా పనులు జరగలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన 8 నెలల్లోనే 80 శాతం వరకు నిర్మాణం పూర్తిచేసుకుంది. మరో నాలుగు నెలల్లో తుది మెరుగులు దిద్దుకుని సిద్ధంగా ఉంటుందని కార్పొరేషన్ అధికారులు చెబుతున్నారు. ఇంటీరియల్, ఫర్నీచర్ ఏర్పాటుతో ఏడాదిలోపు కొత్త ఐకానిక్ భవనం అందుబాటులోకి రానుంది.

స్మార్ట్ సిటీ నిధులతో 2018 టీడీపీ హయాంలో పురుడుపోసుకున్న సీఓసీ ప్రాజెక్టు వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మూడేళ్ల పాటు పక్కన పెట్టేసింది. ఎన్నికలకు ఏడాదిన్నర ముందు 2022 ఆగస్టు 21న కొత్త భవనానికి భూమిపూజ జరిగింది. రూ.71 కోట్లతో ఈరోడ్‌కు చెందిన ఆర్.తులసి బిల్డర్స్ సీఓసీ బిల్డింగ్ కాంట్రాక్ట్‌ను దక్కించుకుంది. 18 నెలల్లో పూర్తి చేయాలన్న నిబంధన ఉండడంతో సార్వత్రిక ఎన్నికల లోపు భవనాన్ని తమ చేతులతోనే ప్రారంభించాలని వైసీపీ పెద్దలు ఉవ్విళ్లూరారు. భూమిపూజ కార్యక్రమంలో ఈ విషయాన్ని సభాముఖంగా కాంట్రాక్టర్‌ను కోరారు. అయితే కమీషన్ల రూపంలో చేరాల్సిన వారికి పెద్దమొత్తంలో ముట్టజెప్పాల్సి రావడంతో కాంట్రాక్టర్ అసంతృప్తికి గురయ్యారన్న ప్రచారం జరిగింది. అదే సమయంలో పనులు ప్రారంభంలో సకాలంలో వచ్చిన బిల్లులు తర్వాత రాకపోవడంతో ఒక దశలో కాంట్రాక్టర్ చేతులెత్తేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ భవనంపై ప్రత్యేక దృష్టిపెట్టింది. నిధుల కొరత ఉన్నప్పటికీ కమిషనర్ మౌర్య చొరవ తీసుకుని నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నారు.

● **ప్రత్యేకతలివే..**

తిరుపతికి తలమానికంగా స్వామివారి నామాలు ప్రతిబింబించేలా భవన నిర్మాణం ఉండనుంది. సుమారు 1.5 ఎకరాల విస్తీర్ణంలో 5 అంతస్థులతో రూపుదిద్దుకుంటోంది. పాత కార్యాలయం 2,289చ.మీ విస్తీర్ణమైతే కొత్తగా నిర్మించబోయేది 14,607 చ.మీ విస్తీర్ణంతో ఉండనుంది. నగర ప్రజల భద్రతకు పెద్దపీట వేస్తూ కమాండ్ కంట్రోల్ వ్యవస్థతో పాటు సిటిజెన్ సర్వీసెస్, ఎన్విరాన్మెంట్ సైన్సెస్, నీరు, విద్యుత్ వినియోగ వివరాలను ఈ సెంటరు నుంచి పర్యవేక్షించే విధంగా ఏర్పాటు చేయనున్నారు. మేయర్, డిప్యూటీ మేయర్ల ఛాంబర్లు, కౌన్సిల్ సమావేశ మందిరంతో పాటు కమిషనర్ ఛాంబర్, విభాగాధిపతులకు ప్రత్యేక గదులు కూడా ఉంటాయి.

రేషన్..రెండు రోజులే..!



శివజ్యోతినగర్‌లోని 67వ రేషన్ షాపు ముందు నిరీక్షిస్తున్న లబ్ధిదారులు

తిరుపతి అర్బన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రేషన్ సరుకులు తీసుకోవాలంటేనే జనం విసుగెత్తిపోతున్నారు. గంటల తరబడి ఉంటేగానీ సరుకులు అందడం లేదు. నగరంలోని చాలా దుకాణాల్లో రెండురోజులు మాత్రమే సరుకులు పంపిణీ చేస్తున్నారనే విమర్శలున్నాయి. అదీ ఉదయం, సాయం త్రం రెండు గంటలు మాత్రమే ఇస్తున్నారు. గంటల తరబడి క్యూలో వేచి ఉన్నా సరుకులు అందుతాయన్న గ్యారెంటీ లేదు. ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రతినెలా 15వ తేదీ వరకు సరుకులు ఇవ్వాల్సి ఉన్నా దాన్ని డీలర్లు పాటించడం లేదు. సివిల్ సప్లయ్ అధికారులు దుకాణాలవైపు కన్నెత్తిచూడడం లేదు. ఫలితంగా కార్డుదారులకు అవస్థలు తప్పడం లేదు. ఆదివారం సాయంత్రం శివజ్యోతినగర్‌లోని 67వ రేషన్‌షాపు ముందు లబ్ధిదారులు పడిగాపులు కాయడమే ఇందుకు నిదర్శనం. సాయంత్రం నాలుగు గంటలకు రావాలని నిర్వాహకులు చెప్పడంతో లబ్ధిదారులు మూడు గంటల నుంచే వేచి ఉన్నారు. సాయంత్రం ఆరు గంటలైనా రేషన్ ఇవ్వలేదు. దీంతో చాలామంది ఇళ్లకు వెళ్లిపోయారు. తీరా సాయంత్రం 6.30 గంటలకు రావడంతో జనం నిలదీశారు. ఎంతసేపు వేచి చూడాలని ప్రశ్నించారు. చాలాసేపు వాగ్వాదం తర్వాత సరుకులు తీసుకున్నారు. అది కూడా జొన్నలు ఇవ్వలేదు. అధికారులు స్పందించి సరుకులు కనీసం వారం రోజులైనా ఇచ్చేలా చూడాలని కోరుతున్నారు.

తిరుమల క్షేత్రంపై ఆగని విమాన రాకపోకలు

● అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న ఆగమపండితులు
● నో ఫ్లైయింగ్ జోన్ కోసం మళ్లీ ప్రయత్నాలు
● కేంద్రానికి లేఖ రాసిన టీటీడీ చైర్మన్

తిరుమల, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): తిరుమల క్షేత్రంపై విమానాల సంచారం ఆగడంలేదు. శ్రీవారి గర్భాలయ ఆనందనిలయంపై విమానాలు వెళ్లడం ఆగమశాస్త్ర విరుద్ధమని, మహా అపచారమని పండితులు వాపోతూనే ఉన్నారు. అయినప్పటికీ నిత్యం విమానాల రాకపోకలు కొనసాగుతునే ఉన్నాయి. దీంతో 20 ఏళ్లుగా టీటీడీ, కేంద్ర విమానయాన శాఖకు మధ్య నలుగుతున్న 'నో ఫ్లైయింగ్ జోన్' అంశం మరోసారి తెరపైకి వచ్చింది. తిరుమల క్షేత్రాన్ని నోఫ్లైయింగ్ జోన్‌గా ప్రకటించాలని కోరుతూ కేంద్రానికి టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు ఇప్పటికే లేఖ రాశారు. కొన్నేళ్లుగా నిత్యం విమానాలు, చార్టర్డ్ ఫ్లైట్స్, జెట్‌లు తిరుమల క్షేత్రం మీదుగానే వెళుతుండటంతో ఆగమపండితులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. పవిత్రమైన గర్భాలయంపై విమానాలు రాకపోకలు సాగించడం ఆగమవిరుద్ధమంటున్నారు. పైగా తిరుమలకు ఉగ్రవాద ముప్పు ఉందనే హెచ్చరికలు కూడా లేకపోలేదు. 2015లో ఆలయ భద్రతను పరిశీలించేందుకు వచ్చిన పార్లమెంటరీ కమిటీ కూడా తిరుమల క్షేత్రాన్ని నో ఫ్లైయింగ్ జోన్‌గా ప్రకటించాల్సిన అవసరముందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. గత 20 ఏళ్లుగా తిరుమలను నోఫ్లైయింగ్ జోన్‌గా ప్రకటించాలని టీటీడీ కేంద్ర విమానయాన శాఖకు లేఖలు రాస్తూనే ఉంది. ఇది ఆగమశాస్త్ర విరుద్ధంతో పాటు భద్రతకూ ఇబ్బందేనని ఆ లేఖల్లో పేర్కొంటూ వస్తోంది. అయితే తిరుమలను నో ఫ్లైయింగ్ జోన్‌గా ప్రకటించడం సాధ్యం కాదని 2016లోనే పౌర విమానయాన శాఖ స్పష్టం చేసింది. అలా ప్రకటిస్తే విమానసేవల నిర్వహణ కష్టమవుతుందని చెప్పుకొచ్చింది. తిరుమల కొండలపై అదనపు నిషేధం వల్ల తిరుపతి విమానాశ్రయంలోనూ సేవలకు అంతరాయం ఏర్పడే అవకాశాలున్నాయని, తిరుపతి ఎయిర్‌పోర్టు కొండల మధ్యలో ఉండటంతో నో ఫ్లైయింగ్ జోన్ ప్రకటన చేయలేమని కేంద్రం స్పష్టం చేసింది. అయినప్పటికీ భక్తుల మనోభావాలను దృష్టిలో పెట్టుకుని టీటీడీ మాత్రం తమ ప్రయత్నాలు ఆపలేదు. తాజాగా రెండేళ్లుగా మరింతగా విమానాల సంచారం పెరిగిన క్రమంలో టీటీడీ చైర్మన్ కేంద్రానికి లేఖ రాయడంతో పాటు చెన్నై ఏటీసీ (ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్)ని కూడా సంప్రదించి విమానాల రాకపోకలకు అడ్డుకట్ట వేసేలా ప్రయత్నాలు మొదలుపెట్టారు. తిరుమలపై విమానాల రాకపోకల నిషేధంపై కేంద్రం నిర్ణయం తీసుకునేంతవరకైనా విమానాలు లోహైట్, గర్భాలయం మీదుగా రాకుండా చర్యలు తీసుకోవాలని చెన్నై ఏటీసీకి విజ్ఞప్తి చేయనున్నారు. దీనికి సంబంధించిన డాక్యుమెంట్‌ను కూడా టీటీడీ సిద్ధం చేసింది. ఈ అంశంపై కేంద్రం, చెన్నై ఏటీసీ అధికారులను టీటీడీ అధికారుల బృందం కలవనుంది.

సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలకు అటానమస్ హోదా

తిరుపతిరూరల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం సి.గొల్లపల్లెలోని సిద్ధార్థ ఇంజినీరింగ్, ఎంబీఏ కళాశాలకు యూజీసీ అటానమస్ హోదా(స్వయంప్రతిపత్తి) లభించిందని కళాశాల సెక్రటరీ వై.ఆనందరెడ్డి పేర్కొన్నారు. బైరాగిపట్టెడలోని రిమ్స్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే కళాశాల న్యాక్ గుర్తింపు పొందిందని, ఇప్పుడు ప్రతిష్టాత్మక అటానమస్ హోదా రావడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. సాంకేతిక, మేనేజ్‌మెంట్ విద్యలో గ్రామీణ విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్ది, ఉద్యోగావకాశాలు కల్పించేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. చైర్మన్ వై.కొండారెడ్డి, వైస్ చైర్మన్ వై.విజయ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశేఖర్ పాల్గొన్నారు.

గరుడ వాహనంపై వెంకన్న రాజసం



శ్రీకాళహస్తి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొండమానుపురంలో కొలువై ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న అభయ హస్త వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా ఆదివారం స్వామివారు గరుడ వాహనంపై గ్రామంలో విహరించారు. ముందుగా స్వామిఅమ్మవార్లను సుప్రభాతసేవతో మేల్కొపి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ఉదయం దేవేరుల సహా స్వామి వారికి స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం ఊంజల్ సేవ జరిగింది. రాత్రి సర్వాలంకార శోభితుడైన స్వామి వారు గరుడ వాహనంపై ఆశీనులై గ్రామవీధుల్లో ఊరేగారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు



ధనుష్క, లోకేష్, సారా నృత్య ప్రదర్శన

శ్రీకాళహస్తి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ధూర్జటి కళాప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సాయంత్రం 4గంటలకు తిరుపతికి చెందిన తిలోత్తమ భక్తిరంజనితో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. 4.30గంటలకు నెల్లూరుకు చెందిన చావలి వెంకటలక్ష్మి వీణ కచేరి, 5గంటలకు పట్టణానికి చెందిన హవ్యశ్రీ నృత్య ప్రదర్శన, 5.30గంటలకు ధనుష్క నృత్య ప్రదర్శన, 6గంటలకు ఒడనసార నృత్య ప్రదర్శన ఆకట్టుకున్నాయి. 8గంటలకు హైదరాబాద్‌కు చెందిన రమ్యానాయుడు కూచిపూడి నృత్య ప్రదర్శన, 9గంటలకు పట్టణానికి చెందిన తనుశ్రీ భరతన్యాటం, 9.30గంటలకు మంజుశ్రీ భరతనాట్యం అలరించాయి.

భక్తుల కోసం మరిన్ని టాయిలెట్ల నిర్మాణం

● అదనపు క్యూలైన్ల వద్ద రూ.3.36 కోట్లతో పనులు





క్యూలైన్ల వద్దనున్న తాత్కాలిక మరుగుదొడ్లు, క్యూలైన్‌కు అనుసంధానం చేస్తూ ఇటీవల నిర్మించిన శాశ్వత టాయిలెట్

తిరుమల, మార్చి2 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో అదనపు క్యూలైన్ల వద్ద శాశ్వత టాయిలెట్ల నిర్మాణానికి టీటీడీ సిద్ధమవుతోంది. దీనికోసం టీటీడీ ఇటీవల రూ.3.36 కోట్లు మంజూరు చేస్తూ తీర్మానించింది. దీంతో టీటీడీ ఇంజినీరింగ్ విభాగం టెండర్ల ప్రక్రియకు ప్రణాళికలు రూపొందిస్తోంది. సాధారణంగా దర్శనానికి వచ్చే భక్తులు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరి షెడ్లలోనూ వేచి ఉంటారు. ఇక్కడ సౌకర్యాలు బాగానే ఉన్నాయి. అయితే వారాంతాలు, పర్వదినాల సమయంలో సర్వదర్శన క్యూలైన్ పెరిగిపోతోంది. కృష్ణతేజ విశ్రాంతి భవనం నుంచి శిలాతోరణం సర్కిల్, బాటగంగమ్మ ఆలయం మీదుగా ఆక్టోపస్ సర్కిల్ వరకు వ్యాపిస్తోంది. దీంతో వెలుపల క్యూలైన్లలో ఉండే భక్తులు టాయిలెట్ల విషయంలో ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరిలు గుర్తించారు. క్యూలైన్లతో పాటు శాశ్వత టాయిలెట్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇప్పటికే ఔటర్ రింగురోడ్డులోని కృష్ణతేజ సర్కిల్ నుంచి ఆక్టోపస్ సర్కిల్ వరకు శాశ్వత క్యూలైన్లను ఏర్పాటు చేశారు. ఐదు టాయిలెట్లను కూడా ఏర్పాటు చేశారు. గతేడాది డిసెంబరు 24న జరిగిన ధర్మకర్తల మండలి సమావేశంలో మరో ఆరు శాశ్వత టాయిలెట్ల బ్లాక్స్ ఏర్పాటుకు చేయాలని తీర్మానించారు. అక్వార్ ట్యాంక్ విశ్రాంతి భవనాల నుంచి బాటగంగమ్మ సర్కిల్ వరకు వీటిని ఏర్పాటు చేసేందుకు ఇంజినీరింగ్ అధికారులు ప్రణాళికలు రూపొందించుకున్నారు. త్వరలో టెండర్ల ప్రక్రియ పూర్తిచేసి నిర్మాణాలను ప్రారంభించనున్నారు.

మోటరు సైకిల్‌ను ఢీకొన్న కారు

ఒకరి మృతి, మరొకరికి తీవ్ర గాయాలు



మురళీరెడ్డి (ఫైల్‌ఫొటో)

గూడూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నూరు సమీపంలో మోటారు సైకిల్‌ను వెనుక నుంచి కారు ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందగా, మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. రూరల్ ఎస్ఐ మనోజ్‌కుమార్ వివరాల మేరకు... మండలంలోని చెన్నూరు గ్రామానికి చెందిన అల్లూరు మురళీరెడ్డి(58), రమణారెడ్డి ఆదివారం వేకువజామున గ్రామ సమీపంలోని కటాలమ్మగుడి వద్ద వాకింగ్ చేసేందుకు వెళ్లారు. తిరిగి మోటరుసైకిల్‌పై గ్రామానికి వస్తుండగా ఆలయ సమీపంలో తిప్పవరప్పాడు నుంచి గూడూరు వైపు వెళుతున్న ఓ కారు అదుపుతప్పి ముందు వెళుతున్న మోటరుసైకిల్‌ను వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో మురళీరెడ్డి అక్కడికక్కడికే మృతిచెందగా, రమణారెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. రమణారెడ్డికి స్థానిక ఏరియా ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. మురళీరెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సేవా గుణాన్ని చాటుకోవాలి



వాహనశాల, అర్చక నివాసం నూతన భవనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ తమకు ఉన్నంతలో కొంత సేవా కార్యక్రమాలకు వినియోగిస్తూ సేవా గుణాన్ని చాటుకోవాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక అళఘనాథ స్వామి ఆలయంలో పాలక మండలి మాజీ చైర్మన్ బొమ్మిరెడ్డి సురేంద్రరెడ్డి దాతృత్వంతో నిర్మించిన వాహనశాల, అర్చక నివాసం, వంటశాల భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను పెంపొందించుకుని ప్రశాంత జీవనం సాగించాలన్నారు. ప్రాచీనమైన, ప్రసిద్ధి చెందిన అళఘనాధస్వామి ఆలయంలోని వాహనశాల, వంటశాల, అర్చకుల నివాసం శిథిలావస్థకు చేరుకోవడంతో బొమ్మిరెడ్డి సురేంద్రరెడ్డి ముందుకు వచ్చి నూతన భవనాలను నిర్మించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో శషాంక్, బొమ్మిరెడ్డి సురేంద్ర రెడ్డి, డాక్టర్ జనార్ధనరెడ్డి, మునిగిరీష్, దశరధరామిరెడ్డి, పులిమి శ్రీనివాసులు, అరికట్ల మస్తాన్‌నాయుడు, బిల్లు చెంచురామయ్య, రవీంద్రరెడ్డి, అనిల్ కుమార్, తూపిలి సురేంద్ర, అర్చకుడు సత్యఅశోక్ తదితరులు పాల్గొన్నారు.

చదువుల్లో ప్రోత్సహించేందుకు సహకారం



విద్యార్థినులకు బహుమతులను అందజేస్తున్న బలిజ మహిళా సంక్షేమసంఘం సభ్యులు

గూడూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): చదువుల్లో ప్రతిభ చాటే విద్యార్థినులను ప్రోత్సహించేందుకు బలిజ మహిళా సంక్షేమ సంఘం సహకారం అందిస్తుందని ఆ సంఘ గౌరవాధ్యక్షురాలు సారంగం సులక్ష్మి అన్నారు. ఆదివారం స్థానిక సునీత సేవాసంస్థ కార్యాలయంలో పట్టణానికి చెందిన ఇంజనీరింగ్ విద్యార్థినులు సాయిసురేఖ, మాధురికి అమెరికల్ ప్రోగ్రెసీ తెలుగు అసోసియేషన్ సహకారంతో రూ.20వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో పద్మావతి, సువర్ణలక్ష్మి, ఉమాదేవి, సరోజనమ్మ, ఉషా, సారంగం శ్రీనివాసులు తతితరులు పాల్గొన్నారు.

రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు

గూడూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ధాన్యాన్ని దళారులు, మిల్లర్ల యజమానులు తక్కువ ధరకు కొనుగోలు చేసి మోసం చేస్తే కఠిన చర్యలు చేపడుతామని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. రైతులు ఎంతో పెట్టుబడులు పెట్టి పండించిన ధాన్యానికి ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పిస్తుంటే మధ్యలో దళారులు, మిల్లర్ల యజమానులు తక్కువ ధరకు కొనుగోలు చేసి మోసాలకు పాల్పడడాన్ని సహించబోమన్నారు. ప్రభుత్వం పుట్టికి రూ.19.750 మద్దతు ధర అందిస్తుంటే దళారులు రూ.17వేలు మాత్రమే చెల్లిస్తూ రైతులను మోసం చేయడం తగదని ఎమ్మెల్యే అన్నారు.

శ్రీవారి సేవలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి





జస్టిస్ సుజన, కేశబ్ మహంత, అతుల్ బోరా

తిరుమల, మార్చి2(ఆంధ్రజ్యోతి): తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.సుజన ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో కుటుంబ సమేతంగా ఆలయంలోకి వెళ్లిన ఆమె ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూల మూర్తిని దర్శించుకున్నారు. అనంతరం రంగనాయక మండపానికి చేరుకున్న సుజనకు వేదపండితులు ఆశీర్వచనం చేయగా అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు. అలాగే అసోం రాష్ట్ర మంత్రులు కేశబ్ మహంత, అతుల్ బోరా కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

నేటి నుంచి ఆలిండియా పోస్టల్ క్యారమ్ టోర్నీ



లోగోను ఆవిష్కరిస్తున్న సంతోష్‌నేత

తిరుపతి(క్రీడలు), మార్చి 2 (ఆంధ్రజ్యోతి): తపాల ఉద్యోగుల్లో ఐక్యత పెంచేందుకు ఏపీ పోస్టల్ సర్కిల్ ఆధ్వర్యంలో తిరుపతిలో సోమవారం నుంచి ఐదు రోజుల పాటు ఆలిండియా పోస్టల్ క్యారమ్ టోర్నమెంటు నిర్వహిస్తున్నట్లు ఏపీ ముఖ్య పోస్టుమాస్టర్ కె.సంతోష్‌నేత తెలిపారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇందిరా మైదానంలోని మల్టీ స్పోర్ట్స్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్న ఈ టోర్నీ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా ఎస్వీయూ వీసీ సీహెచ్ అప్పారావు హాజరవుతారని పేర్కొన్నారు. అనంతరం టోర్నీ లోగోను ఆవిష్కరించారు. చీఫ్ పోస్టుమాస్టర్ జనరల్ ప్రకాష్, తిరుపతి ఎస్పీవో నారాయణప్ప, వెంకటరెడ్డి, సతీష్ పాల్గొన్నారు.

రేపు ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

వెంకటగిరి టౌన్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీచర్స్ కాలనీలోని శ్రీనివాసన్ సేవాసంస్థ (టీవీఎస్) సుందరం క్లేటన్ లిమిటెడ్ కార్యాలయంలో ఈ నెల 4వ తేదీ మంగళవారం ఉదయం 9 నుంచి 12గంటలకు వరకు ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఆ సంస్థ క్లస్టర్ ఇన్‌ఛార్జి జయసింగ్ ఆదివారం తెలిపారు. 2020 నుంచి 2025 మధ్య ఐటీఐ, డిప్లమో, ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన యువతీ, యువకులు అర్హులన్నారు. 18నుంచి 25 ఏళ్ల వయస్సు కలిగి, అవివాహితులై ఉండాలన్నారు. పూర్తి వివరాలకు 76618 20405, 96523 00414, 91771 24827, 93925 56735, 93905 74591 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

వాకాడు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయశాఖ అధికారిణి దీప కోరారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేస్తామని తెలిపారు. తేమ 17శాతం కంటే తక్కువగా ఉన్న ధాన్యాన్ని క్వింటాలుకు రూ2,325 మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేస్తామన్నారు. రైతు సేవా కేంద్రంలోని గ్రామ వ్యవసాయ సహాయకులకు తెలియజేస్తే షెడ్యూల్, తేమ శాతం, రవణా తదితర అంశాలను తెలుసుకోవచ్చన్నారు. అలాగే సహకార సంఘం (పీఏసీఎస్) ధాన్యం కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉందన్నారు.

పచ్చని చెట్లపై గొడ్డలి వేటు

- ఎడారిగా మారుతున్న గ్రామాలు
- అమలుకు నోచుకోని వాల్టా చట్టం





కోగిలి వద్ద రోడ్డు పక్కన నరికివేసిన వేప చెట్టు - కొత్తగుంట పెట్రోలింగ్ సమీపంలో నిల్వ చేసిన వేప, కానుగ, కరతుమ్మ చెట్ల కలప

చిట్టమూరు, మార్చి2 (ఆంధ్రజ్యోతి): మొక్కలు నాటాలి... పర్యావరణాన్ని కాపాడాలన్న ప్రభుత్వ లక్ష్యం నీరు గారుతోంది. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ప్రభుత్వంతో పాటు పర్యావరణ పరిరక్షణ సంస్థలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా ఫలితం లేకుండా పోతోంది. చెట్లను రక్షించే వాల్టా చట్టం అమలుకు నోచుకోవడం లేదు. కొందరు అక్రమార్కులు యథేచ్ఛగా చెట్లను నరికి కలప విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. మండలంలో ఇటుక బట్టీలు, బొగ్గు తయారీకి కలప అవసరం కావడంతో డిమాండ్ నెలకొంది. దీంతో ప్రభుత్వ భూములు, ప్రధాన రహదారులకు ఇరువైపులా ఉన్న భారీ వృక్షాలపై అక్రమార్కులు కన్నేశారు. కరతుమ్మ చెట్ల నుంచి వేప వరకు ఏదీ వదిలి పెట్టకుండా నరికేస్తున్నారు. మండలంలో తీరప్రాంత గ్రామాలైన కోగిలి, ఎల్లూరు, బురదగాలి, కొత్తపాళెం, కుమ్మరిపాళెం గామాల్లో కరతుమ్మ చెట్లు అత్యధికంగా ఉన్నాయి. ఈ చెట్లను నరికేందుకు ఎటువంటి అనుమతులు లేకపోవడంతో యథేచ్ఛగా నరికి విక్రయాలు సాగిస్తున్నారు. ఇక ఇంటి గృహోపకరణలకు కిటికీలు, ద్వార బంధనాలకు, వేప కొయ్యను ఎక్కువగా వాడుతుంటారు. అటువంటి విలువైన చెట్లను నరికి కోట, నాయుడుపేట ప్రాంతాల్లోని కొయ్య మిల్లులకు, ఇటుక బట్టీలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. విచ్చలవిడిగా చెట్లను నరికి తరలిస్తున్నా అధికారులు నిమ్మకునీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మండలంలో వృక్ష సంపదను పరిరక్షించాలని ప్రజలు కోరుతున్నారు.





గోతులమయంగా ఉన్న వెంకటగిరి - నాయుడుపేట రోడ్డు

అడుగడుగునా గోతులే

వెంకటగిరి - నాయుడుపేట రోడ్డులో దుర్భరంగా మారిన ప్రయాణం

వెంకటగిరి టౌన్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి - నాయుడుపేట రోడ్డు గోతులుతేలి ప్రయాణం దుర్భరంగా మారింది. పట్టణంలోని కోళ్లఫారం నుంచి ఏపీ మోడల్ స్కూల్ వరకు 400 మీటర్ల దారిలో 20 గోతులు ఏర్పడ్డాయి. వర్షం పడితే ఎక్కడ గుంతలు ఉన్నాయో తెలియక వాహనదారులు ప్రమాదాలకు గురై గాయాలపాలవుతున్నారు. కొన్నిచోట్ల అడుగు లోతుగుంతలు ఏర్పడి ప్రయాణం నరకంగా మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రోడ్ల అభివృద్ధి దృష్టి సారించినా వెంకటగిరి - నాయుడుపేట మార్గాన్ని పట్టించుకోవడంలేదు. ఈ రోడ్డుకు మరమ్మతులు చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులను కోరగా ఆ దారి రైల్వేశాఖకు సంబంధించినదని చేతులు ఎత్తేశారు. ప్రజాప్రతినిధులు స్పందించి వెంకటగిరి - నాయుడుపేట మార్గాన్ని బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

బీపీహెచ్‌యూ భవన నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ తదితరులు

దొరవారిసత్రం, మార్చి2(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రంలో ప్రభుత్వ వైద్యశాల పక్కన బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే విజయశ్రీ ఆదివారం భూమిపూజ చేశారు. 2023 ఏప్రిల్‌లో కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులతో బీపీహెచ్‌యూ భవన నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరు చేసింది. గత ప్రభుత్వంలో కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాకపోవడంతో పనులు ప్రారంభించ లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా విజయశ్రీ మాట్లాడుతూ పేదలకు మంచి వైద్యం అందించాలన్న లక్ష్యంతో బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ భవన నిర్మాణం చేపట్టామని, ఇందులో డయాగ్నోస్టిక్ సెంటర్ నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయాకర్‌రెడ్డి, టీడీపీ నాయకులు శ్రీహరిరెడ్డి, శ్రీనివాసులు నాయుడు, మురళీరెడ్డి, ఇట్టగుంట రత్నయ్య, షబ్బీర్, ప్రసాద్ నాయుడు, నాగేంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత డీఎంహెచ్‌వో రమణయ్య మృతి



డాక్టర్ రమణయ్య (ఫైల్‌ఫొటో)

నాయుడుపేట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేటకు చెందిన విశ్రాంత డీఎంహెచ్‌వో రమణయ్య ఆదివారం మృతి చెందాడు. కొంత కాలంగా అనారోగ్యంతో నెల్లూరులోని నారాయణ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన ఆదివారం మృతి చెందాడు. రమణయ్య స్వగ్రామమైన నాయుడుపేట మండలం బిరదవాడలో సోమవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని

మతిస్థిమితం లేని వ్యక్తికి తీవ్రగాయాలు

వరదయ్యపాలెం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని మతిస్థిమితం లేని వ్యక్తి గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు... మండలంలోని యానాదివెట్టు సమీపంలో సత్యవేడు రహదారిలో రాత్రి 7గంటల సమయంలో గుర్తు తెలియని వాహనం మతిస్థిమితం లేని సురేష్‌ను ఢీకొంది. ఈ ఘటనలో సురేష్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు, కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. 108 అంబులెన్స్‌కు సమాచారం అందించినా సమయానికి రాలేదు. దీంతో కంచరపాళెం మాజీ సర్పంచ్, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి దశరథన్ స్పందించి ఆటోలో వరదయ్యపాళెం ఆస్పత్రికి తరలించడమే కాకుండా చికిత్స ఖర్చుల నిమిత్తం రూ.2,500 బాధితులు తల్లిదండ్రులకు అందజేశారు. పోలీసులు విచారిస్తున్నారు.

చెత్త ద్వారా సంపద తయారీ

వాకాడు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఇంటింటా చెత్త సేకరణ చేపట్టి సంపద సృష్టించవచ్చని ఈవోపీఆర్డీ ఉమామహేశ్వరరావు అన్నారు. మండలంలోని పంచాయతీల్లో ఆదివారం తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించారు.

కోటమ్మకు ప్రత్యేక పూజలు

కోట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): కోట గ్రామదేవత కోటమ్మకు ఆదివారం విశేష పూజలు జరిగాయి. అమ్మవారికి అభిషేకాలు చేసి చందన, పుష్పాలంకారంలో ఉంచారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

భగవద్గీతపై అవగాహన

వెంకటగిరి టౌన్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): స్థానిక టీచర్స్ కాలనీలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి ఇందూజ్ఞాన వేదిక శ్రీకాళహస్తి కమిటీ అధ్యక్షుడు చింత సుబ్రహ్మణ్యం ఆదివారం భగవద్గీతపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ భగవద్గీతను చదవాలని కోరారు. కార్యక్రమంలో వెంకటరత్నమ్మ, వెంకటలక్ష్మి, అమరావతి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సర్వదర్శనానికి 8 గంటలు

తిరుమల, మార్చి2(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్ 2లోని 16 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు. శుక్రవారం నాటి హుండీ ఆదాయం రూ.2.84 కోట్లు లభించింది.

భక్తుల కోసం మరిన్ని టాయిలెట్ల నిర్మాణం

అదనపు క్యూలైన్ల వద్ద రూ.3.36 కోట్లతో పనులు





క్యూలైన్ల వద్దనున్న తాత్కాలిక మరుగుదొడ్లు - క్యూలైన్‌కు అనుసంధానం చేస్తూ ఇటీవల నిర్మించిన శాశ్వత టాయిలెట్

తిరుమల, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో అదనపు క్యూలైన్ల వద్ద శాశ్వత టాయిలెట్ల నిర్మాణానికి టీటీడీ సిద్ధమవుతోంది. దీనికోసం టీటీడీ ఇటీవల రూ.3.36 కోట్లు మంజూరు చేస్తూ తీర్మానించింది. దీంతో టీటీడీ ఇంజనీరింగ్ విభాగం టెండర్ల ప్రక్రియకు ప్రణాళికలు రూపొందిస్తోంది. సాధారణంగా దర్శనానికి వచ్చే భక్తులు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరి షెడ్లలోనూ వేచి ఉంటారు. ఇక్కడ సౌకర్యాలు బాగానే ఉన్నాయి. అయితే వారాంతాలు, పర్వదినాల సమయంలో సర్వదర్శన క్యూలైన్ పెరిగిపోతోంది. కృష్ణతేజ విశ్రాంతి భవనం నుంచి శిలాతోరణం సర్కిల్, బాటగంగమ్మ ఆలయం మీదుగా ఆక్టోపస్ సర్కిల్ వరకు వ్యాపిస్తోంది. దీంతో వెలుపల క్యూలైన్లలో ఉండే భక్తులు టాయిలెట్ల విషయంలో ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరిలు గుర్తించారు. క్యూలైన్లతో పాటు శాశ్వత టాయిలెట్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇప్పటికే ఔటర్ రింగు రోడ్డులోని కృష్ణతేజ సర్కిల్ నుంచి ఆక్టోపస్ సర్కిల్ వరకు శాశ్వత క్యూలైన్లను ఏర్పాటు చేశారు. ఐదు టాయిలెట్లను కూడా ఏర్పాటు చేశారు. గతేడాది డిసెంబరు 24న జరిగిన ధర్మకర్తల మండలి సమావేశంలో మరో ఆరు శాశ్వత టాయిలెట్ల బ్లాక్స్ ఏర్పాటుకు చేయాలని తీర్మానించారు. అక్వేర్ ట్యాంక్ విశ్రాంతి భవనాల నుంచి బాటగంగమ్మ సర్కిల్ వరకు వీటిని ఏర్పాటు చేసేందుకు ఇంజినీరింగ్ అధికారులు ప్రణాళికలు రూపొందించుకున్నారు. త్వరలో టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి నిర్మాణాలను ప్రారంభించనున్నారు.

పాళెంకోటలో ప్రభుత్వ భూముల కబ్జా



ప్రభుత్వ భూములను చదును చేసేందుకు చెట్లను తొలగించిన దృశ్యం

వెంకటగిరి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి సమీపంలోని పాళెంకోట గ్రామ సర్వే నెంబరు 4,5,6,7,8లో సుమారు 83 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జా జరుగుతోంది. మూడు రోజులుగా యంత్రాలతో ప్రభుత్వ భూమి చేస్తున్నా అధికారులు ఎవరూ పట్టించుకోవడంలేదు. మూడు రోజుల నుంచి ఎక్స్‌కవేటర్లు, డోజర్ల సాయంతో చెట్లు తొలగించి చదును చేస్తున్నా రెవెన్యూ అధికారులు అటు వైపు కన్నెత్తి చూడటం లేదని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి పాళెంకోటలో ప్రభుత్వ భూములను కబ్జాదారుల నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

ఉత్తమ ఫలితాలను సాధించాలి



విద్యాసామాగ్రిని అందజేస్తున్న రోటరీవెస్ట్ క్లబ్ సభ్యులు

గూడూరు అర్బన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థినులు ధైర్యంగా పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలను సాధించాలని రోటరీ వెస్ట్‌క్లబ్ సభ్యులు అన్నారు. ఆదివారం స్థానిక బనిగీసాహెబ్‌పేటలోని బీసీ గురుకుల బాలికల పాఠశాలలో రోటరీ వెస్ట్‌క్లబ్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థినులకు పరీక్షా సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థినులు ఒత్తిడికి లోనుకాకుండా ఏకాగ్రతతో పరీక్షలు రాస్తే విజయం సాధిస్తారన్నారు. కార్యక్రమంలో ధనుంజయరెడ్డి, గిరిబాబు, సత్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాసులు, సిద్దారెడ్డి, హరినాథరెడ్డి, అంజని తదితరులు పాల్గొన్నారు.

గోవుల అదృశ్యం

గూడూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): గత కొద్దిరోజులుగా పట్టణంలోని గాంధీనగర్, తిలక్‌నగర్, ఇందిరానగర్ తదితర ప్రాంతాల్లో సుమారు 10 గోవులు అదృశ్యం అయ్యాయని పాడిరైతులు ఆవేదన చెందుతున్నారు. మేతకు వెళ్లిన గోవులు తిరిగి రాకపోవడంతో పలు ప్రాంతాల్లో గాలించినా కనిపించలేదన్నారు.

ముత్యాలమ్మకు పూజలు

చిల్లకూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పుకనుపూరు గ్రామంలో వెలసిన ముత్యాలమ్మకు ఆదివారం పూజలు జరిగాయి. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా నివేదించారు. ఆలయం ఎదుట ఉన్న త్రిశూలం వద్ద టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.

తిరుచ్చిపై సుందరరాజస్వామి అభయం



మాడవీధుల్లో ఊరేగుతున్న సుందరాజస్వామి

తిరుచానూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరులో కొలువై ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత సుందరరాజస్వామి ఆదివారం బంగారు తిరుచ్చిపై తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. స్వామివారి జన్మనక్షత్రం ఉత్తరాబాద్రను పురస్కరించుకుని ఆలయంలో అర్చకులు విశేష పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవర్లకు అభిషేకం చేశారు. రాత్రి తిరువీధి ఉత్సవం నిర్వహించారు. డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో దేవరాజులు, ఏవీఎస్వో సతీష్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సుభాస్కర్‌నాయుడు, చలపతి, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన

తిరుచానూరు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో వారాంతపు సెలవులో భాగంగా బెంగళూరుకు చెందిన అమృతవర్షిణి ఫౌండేషన్ ఫర్ ఆర్ట్స్ కళాకారులు ఆదివారం ప్రదర్శించిన నృత్యరూపకం అలరించింది. కళాకారులు ఇర్షికా ఎస్.కృష్ణమూర్తి, విద్యా విశ్వనాథన్, ఆదితి ఉల్లాల్, జీవిత, దేవి సంవర్ధిని, కీర్తి వర్ధిని తదితరులు పుష్పాంజలి, గజాననయుతం, శ్రీమన్నారాయణ, వర్ణం, చంద్రచూడ, థిల్లానా, పాండురంగాష్టకం వంటి కీర్తనలకు కూచిపూడి నృత్య ప్రదర్శన చేశారు. వీరిని శిల్పారామం ఏవో ఖాదరవల్లి సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు.



ఉత్సాహంగా ఎదురుసేవ





పట్టువస్త్రాలు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధు - గిరిప్రదక్షిణకు బయలుదేరుతున్న స్వామిఅమ్మవార్లు - విద్యుద్దీపకాంతుల్లో ఎదురు సేవ మండపం

శ్రీకాళహస్తి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): కైలాస గిరి ప్రదక్షిణ పూర్తిచేసుకుని తిరిగి వస్తున్న స్వామిఅమ్మవార్లకు ఎదురు వెళ్లి స్వాగతం పలికే ఎదురుసేవను ఆదివారం భక్తులు ఎంతో ఉత్సాహంగా జరుపుకున్నారు. ఉదయం ఆలయం నుంచి వెళ్లిన స్వామి అమ్మవార్లు కైలాసగిరుల ప్రదక్షిణ చేసుకుని సాయంత్రం తిరిగి ఆలయం సమీప ప్రాంతం కోనేటిమిట్ట వద్దకు చేరకుంటారు. ఇక్కడికి గిరిప్రదక్షిణకు వెళ్లలేని భక్తులు పెద్దఎత్తున ఎదురువెళ్లి అక్కడ స్వాగతం పలకడం ఆనవాయితీ. ఇందు కోసం పిల్లలు, పెద్దలు ముందుగా ఎదురుసేవ మండపం వద్దకు చేరుకున్నారు. స్వామిఅమ్మవార్లు వచ్చే లోగా స్వర్ణముఖి నదిలో ఆట పాటలతో ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు.

భక్తులకు సేవలు... శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివారం స్వామిఅమ్మవార్ల గిరిప్రదక్షిణ జరిగింది. ఈ సందర్భంగా వేలాదిమంది భక్తులు స్వామి అమ్మ వార్ల వెంట నడిచారు. భక్తులకు పలు సేవా సంఘాలు అన్నదానం, మజ్జిగ, మంచినీరు పంపిణీ చేశాయి. భక్తకంతేశ్వర సేవాసంఘం తరపున భక్తులకు అన్నదానం జరిగింది. అదే విధంగా జనసేన, బలిజ సేవా సంఘం ఆధ్వర్యంలో సుమారు 2వేలమంది భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కావలి శివకుమార్, వెంకటేష్, సురేష్, లక్ష్మి, రాజ్యలక్ష్మి, యామిని తదితరులు పాల్గొన్నారు.

సందడే సందడి... కైలాసగిరి ప్రదక్షిణ ఆద్యంతం ఆధ్యాత్మికత అనుభూతితో సాగిఅడుగడుగునా సందడిగా జనం సాగిపోయారు. దారిపొడవునా చెట్లు, కొండల నీడలో సేద తీరారు. ఇక విడిది మండపాల వద్ద దాతలు అందించే ఆహార, పానీయాలను స్వీకరించారు. అంజూరు మండపం ఎదురుగా ఉన్న కైలాసగిరి రిజర్వాయరు వద్ద నీటిమట్టం అనువుగా ఉండటంతో పిల్లలు, పెద్దలు సరదాగా ఈత కొట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ తీవ్రతకు ఈత సరదా ఉపశమనం కలిగించింది.



అంజూరు మండపం వద్ద...






అన్నదానం ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఈవో బాపిరెడ్డి - వడ్డిస్తున్న రిషితారెడ్డి - రామాపురం రిజర్వాయర్ వద్ద భక్తజనం - గిరి ప్రదక్షిణకు బయలు దేరిన స్వామివార్లను అనుసరిస్తున్న జనం

కేవీబీపురం పీహెచ్‌సీలో
వైద్యులకు నైట్ డ్యూటీలు వేయరూ!





కేవీబీపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం - సిబ్బంది కోసం నిర్మించిన క్వార్టర్లు

కేవీబీపురం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో రాత్రివేళ వైద్యులను నియమించాలని మండలవాసులు కోరుతున్నారు. సుమారు 45 వేలమంది జనాభా కలిగిన ఈ మండలానికి వైద్యకేంద్రం ఉన్నా పగటి పూట మాత్రమే వైద్యులు, సిబ్బంది ఉంటున్నారు. రాత్రి వేళల్లో నామమాత్రంగా స్టాఫ్ నర్సును డ్యూటీలో ఉంచుతున్నారు. అయితే రాత్రి వేళల్లో ఏదీ జరిగినా స్టాఫ్ నర్సే ప్రథమ చికిత్స అందించాల్సి వస్తోంది. వైద్యులు లేకపోవడంతో తిరుపతికి లేదా, శ్రీకాళహస్తికి రెఫర్ చేస్తారు. అది కూడా అంబులెన్సు అందుబాటులో ఉంటేనే. లేని పక్షంలో తెల్లారిన తరువాత వైద్యులు వచ్చే వరకు వేచ ఉండాల్సిందే. ఎక్స్‌రే, ఆపరేషన్లు తప్పితే అన్ని హంగులతో ఆస్పత్రిని ఏర్పాటు చేశారు. దీంతో పాటు ఇక్కడ సిబ్బంది ఉండటానికి క్వార్టర్స్‌ను కూడా ఏర్పాటు చేశారు. కానీ ఇక్కడ ఎవరూ సిబ్బంది ఉండడం లేదు. పగటి పూట రావడం.. విధులు నిర్వహించి తిరిగి వెళ్లిపోతుంటారు. ఇంత పెద్దమండలానికి రాత్రి వేళల్లో వైద్యులు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి రాత్రి వేళల్లో సిబ్బంది ఇక్కడ ఉండే విధంగా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

పేద ముస్లింలకు నిత్యావసరాల పంపిణీ



వరదయ్యపాలెం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): రంజాన్ పవిత్ర మాసాన్ని పురస్కరించుకుని ఎన్‌ఆర్‌ఐ షేక్‌బాబు నూరుద్దీన్ ఆర్థిక సాయంతో షేక్ అబ్దుల్ ఆధ్వర్యంలో గోవర్ధనపురం మసీదు ఆవరణలో సుమారు వందమంది పేద ముస్లింలకు ఆదివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ముతవలీ, నయీం, రఫీ, అల్లాఉద్దీన్, సిద్ధిక్, బాబు, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు రామాయణం ప్రదర్శన



రామాయణాన్ని చూస్తున్న విద్యార్థులు

బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఈనెల 17నుంచి జరగనున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షల సన్నద్ధతలో భాగంగా మండలంలోని కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో ప్రత్యేక తరగతుల నిర్వహణలో ఆదివారం రామాయణాన్ని ప్రదర్శించినట్లు హెచ్‌ఎం రూపేష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా తెలుగు ఉపాధ్యాయుడు యువశ్రీ మురళి మాట్లాడుతూ టెన్త్ విద్యార్థులకు పాఠ్యాంశం లోని ఉపవాచకమైన రామాయణంలో కాండలు, వాఖ్యాలు, పాత్ర స్వభావం, వ్యాసరూప ప్రశ్న, జాతీయాలతో పాటు 24 మార్కులు వరకు రామాయణం నుంచి అడుగుతారన్నారు. ఇప్పటికే విద్యార్థులకు రామాయణాన్ని బోధించామని, ఒకసారి విద్యార్థులకు సంపూర్ణ రామాయణం చిత్రం ప్రత్యక్షంగా చూపిస్తే ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.

మతోన్మాద బీజేపీ ఆగడాలను అరికడదాం: సీపీఐ



కవాతు చేస్తున్న సీపీఐ నాయకులు

శ్రీకాళహస్తి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మతోన్మాద బీజేపీ ఆగడాలను అరికట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి పిలుపునిచ్చారు. సీపీఐ శత వార్షికోత్సవాల్లో భాగంగా పట్టణంలో జన సేవా దళ్ శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజాస్వామ్యవాదులు, లౌకిక వాదులు, అభ్యుదయవాదులపై అనేక రకాలుగా దాడులు చేస్తూ మతోన్మాదాన్ని ప్రేరేపిస్తోందన్నారు. ఇలాంటి శక్తులను అడ్డుకోవడానికి ప్రజలు ముందుండాలన్నారు. జనమాల గురవయ్య, శశికుమార్, చలపతి, కత్తి రవి, గోపి, మించల శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం షాపుల వద్ద అనధికార పర్మిట్ రూంలు
పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు

సత్యవేడు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో పలు మద్యం షాపుల వద్ద అనధికార పర్మిట్ రూంలు కొనసాగుతున్నా యి. నిబంధనలకు విరుద్ధంగా మద్యం షాపుల వద్దే అక్రమ పర్మిట్ రూంలు వెలుస్తున్నా సంబంధిత ఎక్సైజ్ శాఖ అధికారలు పట్టించుకోకుండా వ్యవహరిస్తున్న తీరుపై విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నూతన మద్యం పాలసీని ప్రవేశ పెట్టిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మద్యం షాపులను దక్కించుకున్న యజమానులు షాపులను తమకు అనుకూలమైన ప్రాంతాల్లోనే ఏర్పాటు చేసుకున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా మద్యం షాపుల యజమానులు పర్మిట్ రూంలు నిర్వహించు కోవాలంటే ప్రభుత్వం నుంచి ప్రత్యేక అనుమతులు పొందాల్సి ఉంది. ఇందుకు గాను సంబంధిత యజమానులు లైసెన్సు ఫీజును ప్రభుత్వానికి చెల్లించాలి. కానీ ఇవేమీ లేకుండా నిబంధనలను తుంగలో తొక్కి ప్రతి మద్యం షాపు వద్ద అక్రమంగా పర్మిట్ రూం ఏర్పాటు చేసుకున్నారు. సత్యవేడు పట్టణంలో నాలుగు మద్యం షాపులు, దాసుకుప్పంలో ఐదు, రాచపాళెంలో ఒకటి మొత్తం పది మద్యం షాపులున్నాయి. అన్ని షాపుల వద్ద అక్రమ పర్మిట్ రూంలు నడుస్తున్నా ఎక్సైజ్ శాఖ అధికారులు అటువైపు కనీసం కన్నెత్తి చూడకుండా, మామూళ్ల మత్తులో తూగుతున్నారన్న ఆరోపణలు గుప్పుమంటున్నాయి. సంబంధిత జిల్లా అధికారులైనా స్పందించి అక్రమ పర్మిట్ రూంల ఏర్పాట్లపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మూడేళ్ల క్రితం ఫిర్యాదు: వీజే క్వారీ సీజ్

కేవీబీపురం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరిందేశం రెవెన్యూలో మఠం గ్రామం వద్ద ఉన్న వీజే క్వారీని తాత్కాలికంగా మూసి వేయాలని కాలుష్య నివారణ అధికారి రాజశేఖర్ ఆదేశాలు ఇచ్చారు. వివరాల్లోకి వెళితే... ఈ క్వారీ కారణంగా చుట్టుపక్కల ఉన్న 15 గ్రామాలు కాలుష్యానికి గురై స్థానికులు అనారోగ్య బారిన పడుతున్నారు. దీనిపై 2023లో కాలుష్య నియంత్రణ అధికారులకు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి పలుమార్లు వచ్చి తనిఖీలు నిర్వహించారే తప్ప చర్యలు తీసుకోలేదు. అయితే ఎట్టకేలకు శనివారం అధికారులు ఈ క్వారీకి సంబంధించిన విద్యుత్ సరఫరాను ఏఈ మునికుమార్ నిలిపివేశారు. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు క్వారీని మూసివేయాలని, పనులు నిర్వహించ రాదని పీసీబీ అధికారులు పేర్కొన్నారు. దీంతో బ్రాహ్మనపల్లి, కండ్లూరు, బ్రాహ్మణచెరువు, గురుకులకండ్రిగ, కేపీపురం, మఠం, రాగిగుంట, పెరిందేశం తదితర గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పుత్తూరు టౌన్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లపల్లి జడ్పీ హైస్కూల్‌లో 1991-92లో టెన్త్ చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారికి చదువు చెప్పిన ఉపాధ్యా యులను సన్మానించారు. 33 సంవత్సరాలు తర్వాత కలిసిన పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. తాము చదివిన పాఠశాలలో ఇకపై టెన్త్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహకంగా ఆర్థిక బహుమతులు అందజేయున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు సేతుమాధవ, సాయినాథ్, కృష్ణయ్య, రాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు వెంచర్ కోసం కల్వర్టు ధ్వంసం

దర్జాగా కన్నలికాలువ స్థలంపై దారి



కాలువ భూమిలో కల్వర్టు ధ్వంసం చేసి ఏర్పాటు చేసిన దారి

శ్రీకాళహస్తి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు వెంచర్ కోసం దర్జాగా కల్వర్టును ధ్వంసం చేస్తున్నారు. ఇష్టారాజ్యంగా కన్నలి కాలువ స్థలంపై దారి ఏర్పాటు చేసేస్తున్నారు. తొట్టంబేడు మండలం బసవయ్యపాళెంలో ఆదివారం జరిగింది. శ్రీకాళహస్తికి ఆనుకుని బసవయ్యపాళెం ఉండడమే కాకుండా పట్టణంలో కలిసిపోవడంతో ఇక్కడ భూములకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. నెల్లూరు నుంచి శ్రీకాళహస్తిలోకి వాహనాలు ప్రవేశించే నంది కూడలి కూడా బసవయ్యపాళెంలోనే ఉంది. నంది కూడలి నుంచి తొట్టంబేడు వద్ద భక్తకన్నప్ప కూడలి వరకు ఇటు నెల్లూరు, అటు చెన్నై రెండు రహదారులను కలిపేందుకు వంద అడుగుల వెడల్పుతో కొత్త బైపాస్‌రోడ్డును నిర్మించారు. దీంతో ఇక్కడ భూములకు అమాంతంగా రెక్కలొచ్చాయి. ఇటీవల నంది కూడలి పక్కనే నాయుడుపేట - తిరుపతి ఆరులేన్ల జాతీయ రహదారి కొత్తగా ఏర్పడింది. సరిగ్గా నంది కూడలి, రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌కు వెనుక వైపున వంద మీటర్ల దూరంలో శ్రీకాళహస్తి పట్టణం నుంచి తొట్టంబేడు మండలం కన్నలి వరకు డ్రైనేజీ కాలువ ఉంది. ఈ కాలువపై కొత్త బైపాస్‌రోడ్డు నిర్మాణంలో భాగంగా కల్వర్టును నిర్మించారు. కన్నలి కాలువ సుమారు 80 అడుగుల వెడల్పుతో సాగుతోంది. కాలువ భూమిపై కొందరు రియల్‌ఎస్టేట్ వ్యాపారులు కన్నేశారు. తమ భూములకు బైపాస్ నుంచి రోడ్డు ఏర్పాటు చేస్తే స్థలాలను అధిక ధరలకు అమ్ముకోవచ్చని పథకం వేశారు. సరిగ్గా పక్కనే కాలువ భూమిపై రోడ్డు వేసేందుకు కసరత్తు ప్రారంభించారు. ఆదివారం అధికార యంత్రాంగం సెలవులో ఉండటంతో కల్వర్టు దక్షిణం వైపున కొంత భాగాన్ని యంత్రాలతో ధ్వంసం చేశారు. కన్నలి కాలవ దక్షిణవైపు కట్టను దారి కోసం చదును చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కన్నలి కాలువను పరిరక్షించాల్సిన అవసరం ఉంది.

గడ్డివాము దగ్ధం



వరదయ్యపాళెం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని కడూరులో మహిళా రైతు కాంతమ్మకు చెందిన 250 మోపుల గడ్డివాము ఆదివారం దగ్ధమైంది. సాయంత్రం 4గంటల సమయంలో గడ్డివాము నుంచి అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో గుర్తించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అయితే వారు వచ్చే సరికి గడ్డివాము పూర్తిగా దగ్ధమైంది. ఎస్‌ఐ మల్లికార్జున, వీఆర్వో పరిశీలించారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు



ధనుష్క, లోకేష్, సారా తదితరుల నృత్య ప్రదర్శన

శ్రీకాళహస్తి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ధూర్జటి కళాప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ముందుగా సాయంత్రం 4గంటలకు తిరుపతికి చెందిన తిలోత్తమ భక్తిరంజనితో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. 4.30గంటలకు నెల్లూరుకు చెందిన చావలి వెంకటలక్ష్మి వీణ కచేరి, 5గంటలకు పట్టణానికి చెందిన హవ్యశ్రీ నృత్య ప్రదర్శన, 5.30గంటలకు ధనుష్క నృత్య ప్రదర్శన, 6గంటలకు ఒదనసార నృత్య ప్రదర్శన ఆకట్టుకున్నాయి. 8గంటలకు హైదరబాద్‌కు చెందిన రమ్యానాయుడు కూచిపూడి నృత్య ప్రదర్శన, 9గంటలకు పట్టణానికి చెందిన తనుశ్రీ భరతన్యాటం, 9.30గంటలకు మంజుశ్రీ భరతనాట్యం అలరించాయి. చివరగా బుచ్చిరెడ్డిపాళెంకు చెందిన వెంకటదుర్గా కళానికేతన్ భీమతాటి నరసయ్య ప్రదర్శించిన శంకరం నాటకంతో ఆదివారం నాటి సాంస్కృతిక కార్యక్రమాలు ముగిశాయి.



పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

పిచ్చాటూరు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని రజానగరం జడ్పీ హైస్కూలులో ఆదివారం 2003-04 విద్యా సంవత్సరంలో టెన్త్ చదివిన విద్యార్థుల అపూర్వ సమ్మేళనం జరిగింది. 18 సంవత్సరాల తరువాత కలుసుకున్న విద్యార్థులు ఒకరినొకరు వారి స్థితి గతులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో సందడి చేశారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించారు.

గరుడ వాహనంపై వెంకన్న రాజసం



శ్రీకాళహస్తి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొండమానుపురంలో కొలువై ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న అభయహస్త వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా ఆదివారం స్వామివారు గరుడ వాహనంపై గ్రామంలో విహరించారు. ముందుగా స్వామిఅమ్మవార్లను సుప్రభాతసేవతో మేల్కొపి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. ఉదయం దేవేరుల సహా స్వామివారికి స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం ఊంజల్ సేవ జరిగింది. రాత్రి సర్వాలంకార శోభితుడైన స్వామివారు గరుడ వాహనంపై ఆశీనులై గ్రామవీధుల్లో ఊరేగారు.

మోడల్‌కాలనీగా తీర్చిదిద్దుతా
ఎమ్మెల్యే సుధీర్

రేణిగుంట, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని తారకరామనగర్‌ను మోడల్ కాలనీగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే సుధీర్ అన్నారు. ఆదివారం తారకరామనగర్‌లో రూ. 55లక్షలతో నిర్మించిన సిమెంటు రోడ్డును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వైసీపీ హయాంలో మూడు టెంకాయలు కొట్టి ఒక్క అభివృద్ధి పనీ చేయలేదని ఎద్దేవా చేశారు. ఇక్కడ అంతర్గత రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ దీపాలు, తాగునీటి సరఫరా వ్యవస్థల కోసం దాదాపు రూ.6కోట్లు అవుతుందన్నారు. టీడీపీ నాయకులు మునిచంద్రారెడ్డి, మెహబూబ్‌బాషా, బుజ్జినాయుడు, రాజేంద్ర, బాలాజి, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తీశ్వరాలయంలో శివరాత్రి నిత్య ఉత్సవాల వివరాలు...

- ఉదయం 4.30గంటలకు: మంగళవాయిద్యాలు
- ఉదయం 5.00: గోపూజ, సర్వదర్శనం
- ఉదయం 6.00: ప్రథమ కాల అభిషేకం
- ఉదయం 7.00: ద్వితీయ కాల అభిషేకం
- ఉదయం 8.00: పరివారదేవాలయాల నైవేద్యం
- ఉదయం 9.00: స్వామిఅమ్మవార్ల పురవీధుల ఉత్సవం
- ఉదయం 10.30: ఉచ్చికాల అభిషేకం
- మధ్యాహ్నం 12.00: వసంత మండపంలో త్రిశూలేశ్వర అభిషేకం
- సాయంత్రం 5గంటలకు: ప్రదోష కాలాభిషేకం
- రాత్రి 6.30: ధ్వజావరోహణం
- రాత్రి 9.00: స్వామిఅమ్మవార్ల పురవీధుల ఉత్సవం, త్రిశూల పల్లకి నవసంధి విసర్జన
- రాత్రి 9.30 గంటలకు: దర్శనం ముగింపు